ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం  కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

ఆదివారం 11 అక్టోబర్ 2026 | Sunday 11 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 176 | Vol.No 28 Issue No .176 | www.visionandhra.in

## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

### సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు



ఢిల్లీ : ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న మిగతా2లో..

## ఎల్‌నినో ఎఫెక్ట్ ..
# తెలంగాణ సర్కార్ అప్రమత్తం..
### సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- నీరు, విద్యుత్ సంక్షోభం రాకుండా సమగ్ర కార్యాచరణకు ఆదేశం
- అక్టోబర్ 12న అనధికారిక కేబినెట్ భేటీ ఏర్పాటు
- కరువు ప్యాకేజీ కింద కేంద్రం రూ.20,000 కోట్లు ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, మిగతా2లో..




## నేటి నుంచి తెలంగాణలో
# శరన్నవరాత్రి సంబరాలు

- వాడవాడలా కొలువుదీరనున్న దుర్గమ్మతల్లులు
- యువత మాలధారణతో భక్తి పారవశ్యం!

తెలంగాణ స్టేట్ బ్యూరో అక్టోబర్ 10, విజన్ ఆంధ్ర: తెలంగాణ నేలపై నేటి నుంచి భక్తి సందడి మొదలైంది. ఆశ్వయుజ మాసం రావడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు రాష్ట్రం మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగనుంది.

అమ్మవారి మహత్యం – శక్తికి ప్రతీక ఈ నవరాత్రులు: పూర్వం మహిషాసురుడి ఆగడాలను అరికట్టడానికి త్రిమూర్తుల శక్తితో దుర్గాదేవి ఉద్భవించి తొమ్మిది రోజులు పోరాడి విజయం సాధించిందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ తొమ్మిది రోజులు శక్తి ఆరాధనకు అత్యంత పవిత్రమైనవి. అమ్మవారిని నిష్ఠతో కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని, అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల మిగతా2లో..

## ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బిగ్ షాక్

- 4,500 ఓట్ల భారీ మెజారిటీతో ఎంప్లాయీస్ కూటమి సంచలన విజయం!






తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 10, విజన్ ఆంధ్ర: తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన టీడబ్ల్యూయూ (తెలంగాణ వర్కర్స్ యూనియన్) ను ఆర్టీసీ కార్మికులు ఘోరంగా ఓడించారు. ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల కూటమి రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 4,500 ఓట్ల భారీ మెజారిటీతో ప్రభంజనం మిగతా2లో..

## దుర్గా నవరాత్రి, దసరా వేడుకలకు పటిష్ట భద్రత

- మహబూబ్ నగర్ ఎస్పీ డి. జానకి



తెలంగాణ స్టేట్ బ్యూరో,మహబూబ్ నగర్, అక్టోబర్ 10, విజన్ ఆంధ్ర: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి (దసరా) పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో మిగతా2లో..

## పట్టభద్రుల మద్దతు కూడగట్టండి..
### కాంగ్రెస్ శ్రేణులకు పొంగులేటి పిలుపు



తెలంగాణ స్టేట్ బ్యూరో, ఖమ్మం, అక్టోబర్ 10, విజన్ ఆంధ్ర: ఉమ్మడి ఖమ్మం-వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శంఖారావం పూరించింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్యతో పాటు గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్ బాబా, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మిగతా2లో..

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి



హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది మిగతా2లో..

## కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

- బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

- ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు
- వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రాజ్యాంగబద్ధ సంస్థలపై బురద చల్లుతున్నారని మండిపాటు



హైదరాబాద్ c ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం మిగతా2లో..

## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'..
### ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

- ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ
- అరెస్టులకు, నిర్బంధాలకు భయపడబోమని స్పష్టీకరణ
- మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్‌ల లక్షణం పిరికితనం అని వ్యాఖ్య
- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల నిరసనల నేపథ్యంలో వ్యాఖ్యలు
- రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి



ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చుని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చుని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత మిగతా2లో..

## పట్టిసీమ ఫలం..
## సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

- పట్టిసీమ ద్వారా నీరందించిన సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణా డెల్టా రైతులు
- చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు
- పట్టిసీమతో 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించామన్న సీఎం
- పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు ఇచ్చామని వెల్లడి
- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ

మిగతా2లో..



## స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..
## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం మిగతా2లో..

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

# కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

# 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'..

దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. "మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

# పట్టిసీమ ఫలం.. సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## రిజిస్ట్రేషన్ దస్తావేజులు పోయినవి

రుద్రారం రామ చారి s/o శ్రీ రామ లింగా చారి, నివాసం హౌస్ నెంబర్ 2-89/గా, గాంది నగర్, గ్రామం భూదాన్ పోచంపల్లి,మండలం భూదాన్ పోచంపల్లి,జిల్లా యాదాద్రి భువనగిరి. వారికి సంబంధించిన క్రింది దస్తావేజులు 01/09/2026 ఇంటినుండి ప్రమాణిస్తున్న సమయంలో పోయినది గిఫ్ట్ డీడ్ నెంబర్ 3001/2008 ఈ పత్రాలు ఎవరికైనా దొరికినచొ ఈ క్రింది నెంబర్ కి సంప్రదించగలరు 9346938838

# పట్టభద్రుల మద్దతు కూడగట్టండి..

పాల్గొన్నారు.

సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి:

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకమని అన్నారు. ఉమ్మడి మూడు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ బరిలోకి దింపిన సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పట్టభద్రులను గుర్తించి వారిని ఓటర్లుగా నమోదు చేయించి, కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని సూచించారు.

70 వేల ఉద్యోగాలు ఇచ్చాం - మరిన్ని నోటిఫికేషన్లు:

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొంగులేటి అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

రూ.9 వేల కోట్ల బకాయిలు చెల్లించాం:

ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని మంత్రి తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ఏకంగా రూ.9 వేల కోట్లతో చెల్లించామని వెల్లడించారు. జీతాలు, పెన్షన్లు, డీఏలు సకాలంలో చెల్లిస్తూ ఉద్యోగుల్లో భరోసా నింపామన్నారు. కాబట్టి ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సంక్షేమం, యువతకు అండ వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రతి పట్టభద్రుడికి వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని, బూత్ స్థాయి నుంచి పనిచేసి పట్టభద్రుల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.

ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది. ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# నేటి నుంచి తెలంగాణలో శరన్నవరాత్రి సంబరాలు

నమ్మకం. అందుకే తెలంగాణలో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అమ్మవారిని తమ ఇంటి ఆడబిడ్డగా భావించి పూజిస్తారు.

వీధి వీధిలో దుర్గమ్మ కొలువు:

నవరాత్రుల ప్రత్యేకతే విగ్రహ ప్రతిష్ఠ. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలైన అలంపూర్ జోగులాంబ ఆలయం, వరంగల్ భద్రకాళి ఆలయం, హైదరాబాద్ లోని ఉజ్జయినీ మహంకాళి, లాల్ దర్వాజా, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాల్లో నిత్యం పూజలు జరుగుతుండగా, వీటికి తోడు ప్రతి వీధి, ప్రతి కాలనీలో యువకులు ముందుకు వచ్చి అమ్మవారి మట్టి విగ్రహాలను తెచ్చి ప్రతిష్ఠించి పూజలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత. పెద్ద పెద్ద మండపాలు వేసి, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, దుర్గామాత విగ్రహాలను కొలువుదీర్చి తొమ్మిది రోజులు నిష్ఠతో పూజలు చేయనున్నారు.

యువత మాలధారణ - నిష్ఠకు ప్రతీక:

ఈ నవరాత్రుల్లో మరో విశేషం యువతీ యువకులు అమ్మవారి మాలలు ధరించడం. ఇది కేవలం మాల కాదు, ఒక దీక్ష. నేటి నుంచి వేలాది మంది యువకులు, యువతులు నల్లని దుస్తులు ధరించి, మెడలో రుద్రాక్ష, స్ఫటిక మాల వేసుకుని తొమ్మిది రోజుల పాటు కఠోర దీక్షలో ఉండనున్నారు. మాంసం, మద్యం, అబద్ధాలకు దూరంగా ఉండి, నేలపై నిద్రిస్తూ, ఉదయం, సాయంత్రం అమ్మవారి ముందు కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణలు, చండీ పారాయణలు చేస్తూ భక్తిలో మునిగిపోతారు. ఈ మాలధారణ వల్ల మనసు పవిత్రమై, కోరికలు నెరవేరుతాయని యువత విశ్వాసం. సాయంత్రం వేళల్లో అమ్మవారి మండపాల వద్ద మహిళలు కోలాటం, దాండియా ఆటలతో సందడి చేయనున్నారు. అమ్మవారి ముందు చేసే కుంకుమార్చనలో పాల్గొంటే సౌభాగ్యం కలుగుతుందని మహిళలు భావిస్తారు.

దసరా తర్వాత నిమజ్జనం - విజయవాడకు యాత్ర:

తొమ్మిది రోజుల దీక్ష అనంతరం దసరా రోజున వాడవాడలా కొలువైన దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నారు. అమ్మవారి మాల వేసుకున్న భక్తులు మాత్రం నిమజ్జనం తర్వాత కూడా దీక్షను కొనసాగిస్తారు.







తెలంగాణ నుంచి వేలాది మంది మాలధారులు నేరుగా ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి తరలివెళ్లనున్నారు. అక్కడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని, కొండపై మాల విరమణ చేసి దీక్షను విరమించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో వారి దీక్ష పరిపూర్ణమవుతుందని నమ్ముతారు. ఈ విధంగా నేటి నుంచి మొదలయ్యే శరన్నవరాత్రులు తెలంగాణలో భక్తి, సంస్కృతి, యువత ఉత్సాహం కలబోసిన కలర్ ఫుల్ పండుగగా మారనుంది.

# కాలనీల్లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు..!

**ఆటపాటలతో సందడిగా వేడుకలు...!**

**ప్రకృతిని ఆరాధిస్తూ బతుకమ్మ సంబరాలు..!**

కాప్రా / అక్టోబర్ -10( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు, ఆడపడుచులు ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు. కాప్రా,వంపుగూడ, శివ సాయి నగర్, సోనియాగాంధీ నగర్, సోనియాగాంధీ నగర్ ఫేజ్-1, శుభోదయం కాలనీ, గణేష్ నగర్, ఈస్ట్ గాంధీనగర్, ద్వారకాపురి కాలనీ, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలు, సంప్రదాయ దుస్తులు ధరించి ఒకచోట చేరి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ జానపద గీతాలు ఆలపిస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలు, ఆచార సంప్రదాయాలు ఈ పండుగకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,





ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నాయి.

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు.. ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# దుర్గా నవరాత్రి, దసరా వేడుకలకు పటిష్ట భద్రత

భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. జిల్లాలో దుర్గామాత మండపాలు, దేవాలయాలు, పూజా కార్యక్రమాలు జరిగే ప్రాంతాలు, రావణ దహనం జరిగే ప్రదేశాలు, ప్రజలు అధికంగా గుమిగూడే చోట్ల పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామన్నారు.

మండప నిర్వాహకులకు 11 సూచనలు:

ఈ సందర్భంగా దుర్గామాత మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలను ఎస్పీ విడుదల చేశారు. మండపాల వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్ హ్ట్టప్స్://జూశీశ్రీఱషవ-జూశీత్తీఞ్ఞ.ంజూశీశ్రీఱషవ.ద్దశీఙ.ఱఅ/ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాలకు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 24 గంటల పాటు ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీరు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, మండపాల వద్ద, శోభాయాత్రల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. అనుమానాస్పద బ్యాగులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ముందు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, పిల్లల భద్రత విషయంలో రాజీపడేది లేదని, వారికి ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పోలీస్ శాఖ నిబంధనలు పాటిస్తూ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్ .. తెలంగాణ సర్కార్ అప్రమత్తం..

సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై మరింత లోతుగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దీని తర్వాత రైతులతో కూడా సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక ఖరారు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దాదాపు 235 మండలాల్లో కరవు ఛాయలు అలముకున్నాయని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ సబ్-కమిటీ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కరవు ప్రభావిత మండలాలను ఆదుకునేందుకు రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. అక్టోబర్ 12న జరిగే సమావేశంలో వ్యవసాయం, సాగు, తాగునీటి లభ్యత, విద్యుత్ డిమాండ్, తక్షణ ఉపశమన చర్యలపై రైతు సంఘాలు, నిపుణుల సలహాలు కూడా తీసుకోనున్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బిగ్ షాక్

సృష్టించింది. ఈ ఎన్నికల్లో మొత్తం 98 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. ప్రతి డిపోలో కార్మికులు ఉదయం నుంచే బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరగనుండగా, తుది ఫలితాలు ఈ నెల 17న అధికారికంగా వెల్లడి కానున్నాయి. అయితే ఇప్పటికే వచ్చిన ఫలితాలతో కూటమి విజయం ఖరారైపోయింది.

గ్రేటర్ లో 26కు 23 - క్లీన్ స్వీప్:

అత్యంత కీలకమైన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 26 బస్ డిపోల్లో ఎంప్లాయిస్ కూటమి ఏకంగా 23 చోట్ల జయభేరి మోగించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కాంగ్రెస్ మద్దతు యూనియన్ కు ఒక్క డిపోలో కూడా ఆధిక్యం దక్కలేదు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో గ్రేటర్ లో కాంగ్రెస్ కు దాదాపు క్లీన్ స్వీప్ ఎదురైందని చెప్పవచ్చు.

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్:

ఈ ఓటమిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నాలుగు జిల్లాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ ఇంచార్జీలు ఈ ఎన్నికలను అసలు పట్టించుకోలేదని, కనీసం డిపోల వద్దకు వెళ్లి కార్మికులను కలవలేదని ఆయన మండిపడ్డారు. పార్టీ యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పనిచేయకపోవడమే ఈ ఘోర ఓటమికి ప్రధాన కారణమని గాంధీభవన్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ఆర్టీసీ కార్మికుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందా? అనే చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు వచ్చిన ఈ ఫలితం కాంగ్రెస్ కు పెద్ద హెచ్చరికగా మారిందని, ఇప్పటికైనా పార్టీ నాయకత్వం క్షేత్ర స్థాయిలో పట్టు బిగించకపోతే రాబోయే ఎన్నికల్లో మరిన్ని ఇబ్బందులు తప్పవని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# విశ్వసనీయత పునాదులు తవ్వుతారా

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి. వ్యవస్థల లోపాలను సరిదిద్దే దిశగా సాగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది తప్ప, వ్యవస్థలను నాశనం చేసే ధోరణి దేశానికే చేటు చేస్తుంది!. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి పార్టీలు అదే చేస్తున్నాయి.

## సేవకు గుర్తింపు.. డాక్టరేట్ ప్రధానం..

**- చెన్నై లో డాక్టరేట్ అందుకున్న అబ్బగొని అశోక్ గౌడ్**





నిజామాబాద్, అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర ): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజక వర్గానికి చెందిన అబ్బగోని అశోక్ గౌడ్ కు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వారు శుక్రవారం చెన్నై లోని కృష్ణ గానసభలో డాక్టరేట్ ను ప్రధానం చేసింది. గత 20 ఏళ్లుగా సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న ఆయనకు ఇది లభించింది. నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్న అతనికి డాక్టరేట్ లభించటం పట్ల ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అశోక్ నిరుపేదలకు అండగా నిలవడం, నిరుద్యోగ యువతకు మార్గదర్శనం అందించడం, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాల్లో చురుగ్గా అశోక్ పాల్గొనేవారు. అదేవిధంగా అనారోగ్యంతో ఉన్న పేదలకు వైద్య సహాయం, అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమన్వయం చేయడం, నిరుపేదలకు సహాయం వంటి సేవా కార్యక్రమాల ద్వారా... సమాజానికి తన వంతు సహకారం అందిస్తున్నారు. మానవత్వం, సేవాభావం, ప్రజల పట్ల బాధ్యత అనే లక్ష్యాలతో అబ్బగొని శోక్ గౌడ్‌కు ఈ డాక్టరేట్ లభించడం పట్ల... ఆయన శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గుర్తింపు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రేరణగా నిలుస్తుందని అబ్బగొని అశోక్ గౌడ్ అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ : కల్వకుంట్ల కవిత

**- సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ పాట సీడీ ఆవిష్కరణ**



హైదరాబాద్ అక్టోబర్ 10 విజన్ ఆంధ్ర : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పూలను దేవతలుగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబరంగా జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని ఆమె అన్నారు, నందీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ పాట సీడీని కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ ఇజ తెలుగు న్యూస్ సమర్పణలో రూపొందించిన ఈ పాటకు ప్రముఖ రచయిత, దర్శకుడు కోదారి శ్రీనివాస్ సాహిత్యాన్ని అందించారు. ప్రముఖ గాయని మమతా రమేష్ ఆలపించగా, నీరజ్ కీస్ సంగీతాన్ని సమకూర్చారు, డీఓపీగా బాలు, కొరియోగ్రాఫర్‌గా శాంది, డ్యాన్సర్‌గా సాజన్య తమ ప్రతిభను కనబరిచారు, జానపద కళాకారుడు గజ్జల శ్రీనివాస్ పర్యవేక్షణలో రూపొందిన ఈ పాట ఎంతో బాగుందని కవిత ప్రశంసించారు, ఈ కార్యక్రమంలో ఈ ఇజ తెలుగు న్యూస్ చైర్మన్ బీవీ బాలకృష్ణ, అవుట్‌పుట్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు ఎంఎన్ తిరుమలరావు, టెక్నికల్ హెడ్ చైతన్య, రిపోర్టర్ దిండిగాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు మహబూబ్‌నగర్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాన్ని మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, మైదానంలో వాటిని ఏర్పాటు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళల ఆటపాటలతో కళాశాల మైదానం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. నగర మేయర్ జి. మమత మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం బ్రహ్మశ్రీ శ్రవణ్‌కుమార్ శర్మ బతుకమ్మ మహత్యాన్ని వివరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, మహిళా కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాగల్లుకలవలపల్లి మధ్య పెద్దపులి సంచారం..

**- పట్టుకునేందుకు రంగంలోకి పూణే బృందం**

**- పంట పొలాల్లోకి వెళ్లొద్దంటూ హెచ్చరికలు..**

**- పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు**

తూర్పుగోదావరి : కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండల పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. చాగల్లు?కలవలపల్లి గ్రామాల మధ్య పులి తిరుగుతున్నట్లు సమాచారం. దీంతో పులిని సురక్షితంగా పట్టుకునేందుకు పూణే రెస్క్యూ టీంతో పాటు ఆర్ఆర్ఆర్ బృందం రంగంలోకి దిగాయి. గ్రామాల పరిసర ప్రాంతాలను జల్లెడ పడుతూ పులి జాడను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పెద్దపులిని పకడ్బందీగా పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు చాగల్లు మండలంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎమ్మార్వో మెరికమ్మ ఆధ్వర్యంలో చాటింపు వేయిస్తున్నారు.పంట పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది హెచ్చరించారు. పాడిపశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ యంత్రాంగం సూచించింది. పెద్దపులి కదలికలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచి, దానిని బంధించేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా ఆట్యా-పాట్యా జట్టుకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేసిన మానవత ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధం!



తెలంగాణ స్టేట్ బ్యూరో,అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర): క్రీడలకు ప్రోత్సాహం అందించడంలో ముందుండే మానవత ఫౌండేషన్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకుంది. ఈ నెల 11, 12 తేదీలలో జగిత్యాల జిల్లా కోరుట్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆట్యా-పాట్యా క్రీడా పోటీలలో పాల్గొననున్న నాగర్‌కర్నూల్ జిల్లా జట్టుకు మానవత ఫౌండేషన్ స్పోర్ట్స్ డ్రెస్ లను అందజేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్న ఈ ప్రతిష్టాత్మక పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆట్యా-పాట్యా టీమ్ పాల్గొననుంది. ఈ నేపథ్యంలో క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు, వారిని ప్రోత్సహించేందుకు మానవత ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ రమ్య వారికి స్పోర్ట్స్ డ్రెస్ లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని మానవత ఫౌండేషన్ డాక్టర్ రమ్య, సందీప్ లు ఆకాంక్షించారు.క్రీడాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది. క్రీడలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో మానవత ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం తమ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

## న్యాయవ్యవస్థలో బహుజనులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

**సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానం**




హైదరాబాద్, అక్టోబర్ 10: న్యాయవ్యవస్థలో బహుజన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానించింది. న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు బలోపేతం కావాలంటే న్యాయమూర్తుల నియామకాలతో సహా అన్ని కీలక వ్యవస్థల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా బహుజన న్యాయవాదులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది.హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం 'ఉన్నత న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం అనే అంశంపై బీసీ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల రాజు అధ్యక్షతన, కార్యదర్శి పొన్నం దేవరాజ్ గౌడ్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.న్యాయవ్యవస్థలో సమాన అవకాశాలకు ప్రాధాన్యంసమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం అందించే వ్యవస్థలోనే అన్ని సామాజిక వర్గాలకు తగిన భాగస్వామ్యం ఉండాలని వక్తలు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో బహుజన వర్గాల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. అర్హత కలిగిన బహుజన న్యాయవాదులకు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## బతుకమ్మ వేడుకలో పాల్గొన్న బొంతు శ్రీదేవి యాదవ్..!









కాప్రా /అక్టోబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : రెడ్డి కాలనీలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి, ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 11వ తేదీ నుండి కట్ట మైసమ్మ దేవాలయ శరన్నవరాత్రి ఉత్సవాలు

హైదరాబాద్ : లోయర్ ట్యాంక్ బండ్ తనకాల కట్ట మైసమ్మ దేవాలయ శరన్నవరాత్రి ఉత్సవాలను 11వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా దేవి శరన్నవరాత్రులను ఘనంగా జరుపుకోనున్నట్టు పేర్కొన్నారు ఈ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రముఖులు రానున్నట్లు తెలిపారు. భక్తులు ఇక్కడకు అధిక సంఖ్యలో వస్తారని వారికి అన్ని సౌకర్యాలను కల్పించనున్నట్టు స్పష్టం చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజు ఒక్కో దేవత రూపంగా అలంకరించడం జరుగుతుందని వివరించారు. చివరి రోజు అమ్మవారి అలంకరణ మహిషాసుర మర్దినిగా ప్రత్యేకంగా అలంకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాన్ని పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# మునేరులో బంగారం కోసం గాలింపు



విజయవాడ, అక్టోబరు 10 : ఏపీలో బంగారం కోసం వేట మొదలైంది. పెనుగంచిప్రోలు దగ్గర మునేరులో కొంతమంది బంగారం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఏటా ఈ ప్రాంతానికి కొందరు వచ్చి బంగారం కోసం గాలిస్తుంటారు. ఈసారి కూడా చిత్తూరు నుంచి మరికొన్ని ప్రాంతాల నుంచి వచ్చి జనాలు బంగార కోసం చూస్తున్నారు.. మునేరు మాత్రమే కాదు ఏపీలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇలా బంగారం కోసం కొంతమంది గాలిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో పెనుగంచిప్రోలు మునేరులో బంగారం కోసం వేట కొనసాగుతోంది. అక్కడ మునేరులో బంగారం, రంగు రాళ్లు దొరకుతాయనే ఆశతో కొందరు గాలిస్తున్నారు. చిత్తూరుతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు రోజంతా మునేరులో బంగారం కోసం వెతుకుతున్నారు. పురతాన కాలంలో పెద కాంచీపురంగా ఉన్న ప్రాంతం పెనుగంచిప్రోలుగా ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ మునేరు పక్కనే పెనగంచిప్రోలు ఉంది. అక్కడ లింగేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, తిరుపతమ్మ ఆలయం ఉంది. పెనుగంచిప్రోలులో కొన్ని దేవాలయాలు పూర్తిగా కనుమరుగుకాగా.. ఈ ఆలయాల్లోని విగ్రహాలు తవ్వకాల్లో బయటపడ్డాయి.ఓ ఇంటి నిర్మాణానికి పునాదుల తవ్వుతున్న సమయంలో పెద్ద నంది విగ్రహం బయటపడగా.. విగ్రహాన్ని తీసుకెళ్లి శ్రీ తిరుపతమ్మ ఆలయంలో ఏర్పాటు చేశారు. మిగిలిన విగ్రహాలు విజయవాడలోని విక్టోరియా మ్యూజియంలో ఉంచారు. మునేరు పరిసరాల్లో తవ్వకాలు చేస్తుంటే విగ్రహాలు బయటపడుతున్నాయి. అక్కడ మునేరులో బంగారం ఉంటుందనే ప్రచారంతో కొంతమంది వెతుకుతున్నారు. మునేరు కాజ్‌వే పక్కన ఇసుకలో ప్రతి రోజూ కొందరు తవ్వకాలు చేస్తున్నారు. రెండు, మూడేళ్ల నుంచి మునేరు దగ్గరకు బంగారం కోసం గాలించేందుకు వస్తున్నారు. ఆలయం దగ్గర మునేరు పరిసర ప్రాంతాల్లోనే వీరంతా నివాసం ఉంటున్నారు. అక్కడ స్థానిక శివాలయం, మునేరు కాజ్‌వే వంటి ప్రాంతాల్లో ఎక్కువగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇలా రెండు, మూడు నెలలు ఉండి బంగారం కోసం వెతుకుతారు.. అనంతరం వారంతా తిరిగి సొంత ఊర్లకు వెళతారు. అప్పుడప్పుడు మునేరులో బంగారం దొరుకుతుందని.. ఆ బంగారాన్ని అమ్ముకుంటే తమ పోషణకు ఇబ్బంది లేకుండా పోతుందంటున్నారు.ఏపీలోని పలు ప్రాంతాల్లోని నదీ పరివాహక ప్రాంతాల్లో బంగారం కోసం గాలిస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా కొంతమంది ఈ బంగారం కోసం వెతుకుతుంటారు. నల్లమల ప్రాంతంలో కూడా కొంతమంది బంగారం కోసం గాలిస్తుంటారు. కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్ర తీరంలో బంగారం కోసం వెతుకుతుంటారు. తమకు కొద్దిపాటి బంగారం దొరికినా జీవితాలు మారిపోతాయనే ఆశతో ఉంటారు. వర్షాలు పడిన తర్వాత బంగారం కోసం వీరు వెతుకుతుంటారు.

# అపోలో మెడికల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో సందడి

## - 141 మందికి డిగ్రీలు ప్రధానం




తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర): నగరంలోని ప్రతిష్టాత్మక వైద్య విద్యా సంస్థ అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (అపోలో మెడికల్ కాలేజీ), హైదరాబాద్ లో శనివారం గ్రాడ్యుయేషన్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. జూబ్లీహిల్స్ లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని భవనం వెంకట్రాం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ వేడుకకు భారతదేశ ప్రఖ్యాత కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ బి. సోమరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అపోలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె. మనోహర్, సీఓవో శ్రీమతి అపర్ణా రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలో మొత్తం 141 మంది వైద్య విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. అందులో 2020 బ్యాచ్ కు చెందిన 97 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ డిగ్రీలు, 2022 బ్యాచ్ కు చెందిన 44 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఎండీ, ఎంఎస్ డిగ్రీలు ప్రదానం చేశారు. వైద్య వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు పద్మశ్రీ డా. సోమరాజు శుభాకాంక్షలు తెలుపుతూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. వైద్య వృత్తి అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, అది ఒక సేవ అని, ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యత వైద్యులపై ఉందని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రతిష్టాత్మక గోల్డ్ మెడల్స్ అందజేశారు. 2020 యూజీ బ్యాచ్ కు చెందిన మాయా దేవి కొచ్చెర్లకోట ఉత్తమ విద్యార్థిగా డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి గోల్డ్ మెడల్ ను, అదే బ్యాచ్ కు చెందిన వెల్లూరి శర్వాణి శ్రీ రమ్య దివంగత సీనియర్ ఫిజీషియన్ డా. కె.వి.ఆర్. ప్రసాద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన డా. కె.వి.ఆర్ ప్రసాద్ మెమోరియల్ గోల్డ్ మెడల్ ను అందుకున్నారు. అలాగే జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డా. సముద్రాల కావ్య ఉత్తమ పీజీ విద్యార్థిగా డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి గోల్డ్ మెడల్ ను అందుకున్నారు. 2012లో ప్రారంభమైనప్పటి నుండి అపోలో మెడికల్ కాలేజీ, హైదరాబాద్ నుండి ఇప్పటివరకు 700 మందికి పైగా విద్యార్థులు విజయవంతంగా పట్టభద్రుల య్యారని, ఈ కళాశాల పూర్వ విద్యార్థులలో 90 శాతానికి పైగా విద్యార్థులు దేశంలోని వివిధ ప్రతిష్టాత్మక వైద్య కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు, విదేశాల్లో రెసిడెన్సీ ప్రోగ్రామ్ లను పొంది తమ ప్రతిభను చాటుకుంటున్నారని డీన్ తెలిపారు. ఇది కళాశాల విద్యా ప్రమాణాలకు, అధ్యాపకుల కృషికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# మగపిల్లల్ని వదలట్లేదు....



హైదరాబాద్, అక్టోబరు 10 : తెలంగాణలో బాలురపై లైంగిక వేధింపుల కేసులు తీవ్ర ఆందోళన కలిగించే స్థాయిలో వెలుగులోకి వస్తున్నాయి. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదైనట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. గతేడాది నమోదైన 61 కేసులను కేవలం 9 నెలల్లోనే ఈ సంఖ్య దాటినట్లు సమాచారం. తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన పోక్సో చట్టం కింద 2024 నుంచి 2026 సెప్టెంబర్ వరకు తెలంగాణలో మొత్తం 127 మంది బాలురు బాధితులుగా నమోదైనట్లు వెల్లడైంది. 2024లో కేవలం నలుగురు బాలురే బాధితులుగా నమోదవగా.. 2025లో ఆ సంఖ్య ఒక్కసారిగా 61కి పెరిగింది. 2026లో సెప్టెంబర్ నాటికే మరో 62 మంది బాలుర కేసులు నమోదయ్యాయి.అయితే కేసుల సంఖ్య పెరగడాన్ని లైంగిక దాడులు అదే స్థాయిలో పెరిగినట్లు నేరుగా అర్థం చేసుకోకూడదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం, బాధితులను గుర్తించడం, బాధిత కుటుంబాలు పోలీసులను ఆశ్రయించడం వంటి కారణాలతో గతంలో వెలుగులోకి రాని ఘటనలు ఇప్పుడు రికార్డుల్లోకి వస్తుండొచ్చని వివరిస్తున్నారు. 2025లో నమోదైన 61 మంది బాల బాధితుల్లో హైదరాబాద్‌లోనే 24 మంది ఉన్నారు. ఖమ్మంలో 13 కేసులు నమోదు అయ్యాయి. 2026 తొలి 9 నెలల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 9 మంది బాలురు బాధితులుగా నమోదయ్యారు.మీర్‌చౌక్, శంషాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో ఏడుగురు చొప్పున బాధితులు నమోదైనట్లు తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించింది. గచ్చిబౌలి, హైదరాబాద్, కరీంనగర్, నిర్మల్, వరంగల్ ప్రాంతాల్లో మూడేసి కేసులు నమోదైనట్లు పేర్కొంది. బాలురపై లైంగిక వేధింపులు జరిగినప్పటికీ అనేక సందర్భాల్లో అవి బయటకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కుటుంబం పరువు పోతుందని.. ఇలాంటి ఘటనలు బయటికి చెబితే సమాజం ఏమనుకుంటుందనే భయం.. అవమానాలు వంటి కారణాలతో కొందరు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని పేర్కొంటున్నారు.మరోవైపు.. తమకు ఎదురైన భయానక అనుభవాన్ని తమ తల్లిదండ్రులకు కూడా చెప్పేందుకు పలువురు బాలురు భయపడే పరిస్థితులు ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా నిందితుడు తమకు తెలిసిన వ్యక్తి అయినప్పుడు బాలుడు విషయాన్ని చెప్పడానికి మరింత ఇబ్బంది పడే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తాజాగా నమోదైన రెండు కేసుల్లోనూ బాధిత పిల్లలు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతోనే ఘటనలు వెలుగులోకి వచ్చాయి.చందానగర్‌కు చెందిన 4 ఏళ్ల బాలుడిపై అతను చదువుతున్న పాఠశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డు లైంగిక దాడికి పాల్పడిన ఘటన 2024 ఫిబ్రవరిలో జరిగింది. నల్లగండ్లలోని పాఠశాలలో పనిచేసే 30 ఏళ్ల సెక్యూరిటీ గార్డు.. బాలుడిని ఆడియో, విజువల్ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత బాలుడు జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పడంతో విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. కేసును విచారించిన ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది జూలైలో నిందితుడిని దోషిగా తేల్చింది. అతడికి 5 ఏళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు బాధిత బాలుడికి రూ.1 లక్ష పరిహారం అందించాలని ఆదేశించింది.మరో ఘటనలో 10 ఏళ్ల బాలుడిపై అతడి పొరుగింట్లో ఉండే బంధువు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2023 డిసెంబర్‌లో కామాటిపుర పోలీసులు కేసు నమోదు చేశారు. 29 ఏళ్ల నిందితుడు టీవీ చూపిస్తానంటూ బాలుడిని తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది.

ఈ విషయం ఎవరికైనా చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బాలుడిని బెదిరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో కొంతకాలం బాలుడు మౌనంగా ఉన్నాడు. చివరకు నొప్పి, రక్తస్రావం రావడంతో జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.ఈ కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది ఏప్రిల్‌లో నిందితుడిని దోషిగా నిర్ధారించి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. బాధిత బాలుడి తక్షణ అవసరాలు, వైద్యం, విద్య కోసం రూ.75 వేల పరిహారం అందించాలని సిఫార్సు చేసింది. తెలంగాణలో బాలురపై లైంగిక నేరాలకు సంబంధించి నమోదైన గణాంకాలు సమస్యలో ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పోలీసుల వరకు చేరని ఘటనలు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలు భయంతో, కుటుంబ సభ్యులు సామాజిక ఒత్తిళ్ల కారణంగా మౌనం పాటిస్తే నేరాలు అధికారిక రికార్డుల్లోకి ఎక్కవని చెబుతున్నారు.అందుకే బాలల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని.. పిల్లలు చెప్పే విషయాలను నిర్లక్ష్యం చేయకుండా వారి మాటలను నమ్మి స్పందించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తమకు తెలిసిన వ్యక్తుల నుంచే ప్రమాదం ఎదురయ్యే అవకాశాన్ని కూడా విస్మరించకూడదని చెబుతున్నారు. 2026లో కేవలం 9 నెలల్లోనే 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదవడం.. బాలుర భద్రత, అవగాహన, ఫిర్యాదు వ్యవస్థలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని మరోసారి ముందుకు తెచ్చింది.

# తెలంగాణలో రోడ్డు ప్రమాదాలనివారణకు 4 ఈ




హైదరాబాద్, అక్టోబరు 10 : తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు 4ఇ విధానాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అంశాల ఆధారంగా కార్యాచరణ చేపట్టనున్నారు. అధిక ప్రమాదాలు నమోదవుతున్న ఏడు జిల్లాల్లో ప్రమాదాల కారణాలను విశ్లేషించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించడంతోపాటు రహదారుల్లోని లోపాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, అధికారులు, సేవ్ ఫౌండేషన్ ప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు.రోడ్డుప్రమాదాలు, వాటి కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్యను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 4ఇ విధానాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. రోడ్డు భద్రతను నాలుగు కీలక అంశాలుగా విభజించి సమగ్ర చర్యలు చేపట్టడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటికి కారణాలను విశ్లేషించి, మరణాలను తగ్గించేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు.డీజీపీ కార్యాలయం నుంచి రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి ఏడు జిల్లాల కలెక్టర్లు, నలుగురు పోలీస్ కమిషనర్లు, సంబంధిత యూనిట్ అధికారులు, సేవ్ ఫౌండేషన్ ప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. టార్గెట్ జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్స్ ఇన్ తెలంగాణ అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయా జిల్లాల్లో ప్రమాదాల తీవ్రత, కారణాలు, నివారణ చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 100 జిల్లాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు డీజీపీ తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన ఏడు జిల్లాలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఈ జిల్లాల్లో ప్రతి ప్రమాదానికి సంబంధించిన కారణాలను లోతుగా విశ్లేషించి, ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బ్లాక్‌స్పాట్లు, రహదారి నిర్మాణ లోపాలు, సరైన సైన్‌బోర్డులు లేకపోవడం, వెలుతురు సమస్యలు వంటి అంశాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారు.ప్రమాదం జరిగిన తర్వాత క్షతగాత్రులకు అందే వైద్యం కూడా ప్రాణాలను కాపాడటంలో కీలకమని డీజీపీ పేర్కొన్నారు. ప్రమాద స్థలానికి అత్యవసర సేవలు త్వరగా చేరుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలని, ఆసుపత్రుల్లో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా సమన్వయం పెంచాలని సూచించారు. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, డ్రైవర్లలో అవగాహన, ప్రమాదకర డ్రైవింగ్‌పై కఠిన చర్యలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. 4ఇ అంటే ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అవగాహన (ఇటబీఇ-జీబితినీని): డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడం. ఇంజినీరింగ్ (ఇనిణతినివవతీతినిణ): ప్రమాదాలకు కారణమయ్యే రహదారి డిజైన్ లోపాలు, బ్లాక్‌స్పాట్లు, మలుపులు, వెలుతురు, సైన్‌బోర్డులు తదితర సమస్యలను గుర్తించి సరిచేయడం. అమలు (ఇనిటనీతీఇ-వఎవనిబి): వేగ పరిమితులు, హెల్మెట్, సీట్‌బెల్ట్, డ్రంక్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా చర్యలు తీసుకోవడం. అత్యవసర సహాయం (ఇఎవతీణవనిఇ-ఎ ాబీజూజూనీతీబి): ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్, పోలీసు, వైద్య బృందాలు స్పందించేలా వ్యవస్థను బలోపేతం చేసి, క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో అత్యవసర చికిత్స అందించడం.

# మాటల యుద్ధం.... కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్




హైదరాబాద్, అక్టోబరు 10 : సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్రమైన రాజకీయ యుద్ధానికి దారితీశాయి. ముఖ్యమంత్రి కుమార్తె నైమిషా రెడ్డి వ్యాపారాలు, ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు రాష్ట్రంలో కలకలం రేపాయి. ఇవి కేవలం రాజకీయ ఆరోపణలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇరు పార్టీల మధ్య పరిస్థితిని మరింత అగ్గి రాజేశాయి.ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల పెట్టుబడులు, ఫార్మా కంపెనీలు, ఆస్తులపై బీఆర్ఎస్ తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా మెడికవర్ హాస్పిటల్స్, కార్ల షోరూంలు, కార్పొరేటే స్కూల్స్ అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం, పోస్టర్లు, బ్యానర్లు వేయడం పెద్ద దుమారం రేపింది. ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం.. సీఎం కుటుంబ సభ్యుల వ్యక్తిగత అంశాలను తెరపైకి తెచ్చి ఆరోపణలు గుప్పించడం అధికార వర్గానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ ఆరోపణలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఖండించింది. సీఎం కుటుంబానికి ఎలాంటి సంబంధం లేని వ్యాపారాలను ఆపాదించడం ద్వారా బీఆర్ఎస్ రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలని బీఆర్ఎస్ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి.ఈ వివాదం రాజకీయ వేదికల నుంచి పోలీస్ స్టేషన్లు, హైకోర్టు వరకు చేరింది. సీఎం కుటుంబంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, క్రిశాంక్ అరెస్ట్ పరిణామాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. సికింద్రాబాద్ కోర్టు ఆయన రిమాండ్‌ను తిరస్కరించడం, ఆ తర్వాత ఆయన తరపున హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు కావడం, హైకోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించడం వంటి పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ముందుగా ప్రాథమిక విచారణ జరపాలని న్యాయస్థానం స్పష్టం చేయడం పోలీసుల తీరుపై చర్చకు దారితీసింది.ఈ మొత్తం ఉదంతంలో బీఆర్ఎస్ పార్టీ దూకుడు పెంచింది. ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై ప్రశ్నించడంలో విఫలమయ్యామనే విమర్శల నుంచి దృష్టి మళ్లించేందుకే ఆ పార్టీ ఇలా చేస్తోందనే ఆరోపణలు లేకపోలేదు. అయితే.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఆ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ దీనిని తీవ్రంగా తిప్పికొడుతోంది. రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రతిపక్షం నీచ రాజకీయాలకు దిగుతోందని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని మండిపడుతోంది.రేవంత్ రెడ్డి కుమార్తె ఆస్తులు, వ్యాపారాల అంశాన్ని తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తున్నప్పటికీ, ఇది ఆ పార్టీకి కత్తి మీద సాములా మారింది. ఒకవైపు ఆధారాలు చూపాలని అధికార పక్షం సవాలు విసురుతుండగా, మరోవైపు చట్టపరమైన చిక్కులు, న్యాయస్థానాల జోక్యం నేపథ్యంలో ఈ వివాదం రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోం

# కేబీఆర్ పార్క్ వివాదంలో రేవంత్ కార్నర్



హైదరాబాద్, అక్టోబరు 10 : హైదరాబాద్‌లోనే అత్యంత కీలకమైన కేబీఆర్ జాతీయ పార్క్ చుట్టూ ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కారిడార్లలో ట్రాఫిక్ నివారణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ప్రారంభంలో ఊ-అమెఎ ప్రాజెక్టు కింద వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 14 రకాల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల సజావుగా నిర్వహణ కోసమే ఆగస్టులో పార్కు చుట్టూ రౌండ్ ది పార్క్ వన్ వే విధానాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పైలట్ ప్రాజెక్ట్‌గా అమల్లోకి తెచ్చారు. అయితే, ఈ వన్ వే పెట్టగానే ట్రాఫిక్ రద్దీ సడలిపోవడంతో, అసలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రతిపాదనలనే పక్కనబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఊహించని యూ-టర్న్ నిర్ణయం ప్రభుత్వంపై తీవ్ర విమర్శల తుఫానును తెచ్చిపెట్టింది. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు అర్బన్ ప్లానర్లు కేవలం వన్ వే విధానంతోనే ట్రాఫిక్ తగ్గుతుందని తెలియడానికి రూ. వందల కోట్ల అంచనా వ్యయాలు, ప్రణాళికలు దేనికి? అని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్ట్ పేరు చెప్పి పార్క్ చుట్టుపక్కల ఇప్పటికే అనేక చెట్లను నరికివేయడం, రోడ్లను తవ్వేసి మౌలిక వసతులను ధ్వంసం చేయడం వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని మండిపడుతున్నారు. సరైన ముందస్తు అధ్యయనం లేకుండా నిధులు వెచ్చించి పనులు మొదలుపెట్టి, ఇప్పుడు సింపుల్ పరిష్కారం లభించింది అని చెప్పి ప్రాజెక్ట్ పక్కన పెట్టడం అనాలోచిత విధానానికి పరాకాష్ట అని విమర్శిస్తున్నారు.మరోవైపు, పౌరులు, వాహనదారుల నుండి కూడా ఈ వన్ వే పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రౌండ్ తిరగడం వల్ల జంక్షన్ల వద్ద సిగ్నల్ రహిత ప్రయాణం సాగుతున్నప్పటికీ, చిన్న దూరాలకు కూడా కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరగాల్సి రావడం వల్ల అదనపు సమయం, ఇంధనం వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు యూ-టర్న్ల వద్ద కొత్త తరహా ట్రాఫిక్ చిక్కులు వచ్చిపడుతున్నాయని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వన్ వే వల్ల సర్దుబాటు అయినా, భవిష్యత్ హైదరాబాద్ ప్రజావసరాలకు ఇది సరిపోతుందా? నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల సంఖ్యను బట్టి చూస్తే, రాబోయే 5 నుండి 10 ఏళ్లలో కేబీఆర్ పార్క్ చుట్టూ వాహనాల రద్దీ రెట్టింపు కావడం ఖాయం. ఒక సాధారణ పోలీస్ ఆర్గనైజ్డ్ వన్ వే లూప్ తాత్కాలిక ఊరటనిస్తుందే తప్ప, పెరుగుతున్న భవిష్యత్తు నగర అవసరాలకు ఇది ఏమాత్రం శాశ్వత పరిష్కారం కాదని రవాణా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ఇలా ముందస్తు ఆలోచనలు లేకుండా నిర్ణయాలు సవరించుకోవడం వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్లానింగ్ తీరుపై నమ్మకం సడలుతోంది. ఒకవైపు ప్రజాధనం వృథా కాగా, మరోవైపు భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా మౌలిక వసతుల నిర్మాణం నిలిచిపోవడం వల్ల దీర్ఘకాలంలో నగర ప్రజలే నష్టపోతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తాత్కాలిక సర్దుబాట్లతో సరిపెట్టకుండా, పర్యావరణాన్ని కాపాడుతూనే భవిష్యత్తు వాహన రద్దీని తట్టుకునేలా సింగిల్ ఎలివేటెడ్ కారిడార్ లేదా లోతైన సైంటిఫిక్ ప్లానింగ్‌తో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. లేనిపక్షంలో ఈ 'వన్ వే ప్రయోగం' ప్రజాధనాన్ని వృథా చేసిన మరో విఫల వ్యూహంగా చరిత్రలో మిగిలిపోతుందనడంలో సందేహం ఉండదని అంటున్నారు.

# కాసులు కురిపిస్తున్న మొగలి పువ్వులు

శ్రీకాకుళం అక్టోబరు 10, : కాకుళం జిల్లాలో రైతులు వినూత్నంగా మొగలి సాగు చేస్తున్నారు. మొగలి మొక్కల్ని నాటి పుష్పాలతో లాభాలు పొందుతున్నారు. మొగలి



పుష్పాల నుంచి తీసిన ఆయిల్‌తో భారీగా ఆదాయం వస్తోంది. మొగలి పువ్వుల నుంచి తీసిన ఆయిల్ లీటర్ రూ.2.50 లక్షలు పలకుతోంది.. సీజన్‌లో అంతకుమించి కూడా డిమాండ్ ఉంటోంది. ఈ ఆయిల్‌ను ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.మొగలి పువ్వుల గురించి మనం వినే ఉంటాం.. కొంతమంది ఇళ్ల దగ్గర ఈ మొగలి చెట్లను పెంచుతుంటారు. రైతులు పొలాలు, కాలువ గట్లపై కూడా పెంచుతారు. తీర ప్రాంతాల్లో ఉండే భూములకు ఈ మొగలి చెట్లు ఎత్తుగా, దట్టంగా పెరిగి రక్షణ గోడగా నిలుస్తాయి. అలాంటి మొగలి చెట్లు శ్రీకాకుళం జిల్లాలో రైతులకు ఆదాయాన్ని తెస్తున్నాయి.. పలు మండలాల్లో దాదాపు 6 వేల హెక్టార్లలో మొగలిని సాగు చేస్తున్నారు. ఈ మొగలి పువ్వుల్ని ఎగుమతి చేసి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడి నుంచి మొగలి పువ్వులు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.ఒక్క కొమ్మ నాటితే ఏడాదిలోగా పిలకలువేస్తూ కంచెగా మారుతుంది. అలాగే ఈ చెట్లకు తెగుళ్లు కూడా రావు.. చుక్కనీరూ అవసరం లేదు. ఏడాదిలో ఒక్కో మొగలి చెట్టు నుంచి నాలుగు నెలల పాటు వెయ్యి పూల వరకు వస్తాయి. మొగలి పువ్వును రైతులు దాదాపు రూ.14 నుంచి 16 వరకు విక్రయిస్తున్నారు. అదే సీజన్‌లో అయితే ఈ ధర ఎక్కువగా ఉంటుంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ పూలకు డిమాండ్ ఉంటుంది. అంతేకాదు శ్రీకాకుళం జిల్లాలో ఈ మొగలి పువ్వుల నుంచి అత్తరు తయారు చేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి. అక్కడ ఇత్తడి పాత్రల్లో ఈ మొగలి పువ్వులను వేసి వేడి చేస్తారు.. అనంతరం అందులో నుంచి వచ్చే ఆవిరినిమరో పాత్రలోకి వెళ్లేలా చూస్తారు. అక్కడ చల్లబడిన నూనెను మరో పాత్రలో నిల్వ చేస్తారు.ఈ నూనె సీజన్‌ను బట్టి లీటర్ రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పలుకుతుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ నూనెను చైనా, రష్యా, అమెరికా వంటి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. కాన్పూర్, భువనేశ్వర్, జైపూర్, కోల్‌కతా వ్యాపారులు కూడా ఈ ద్రావణాన్ని కొనుగోలు చేస్తారు. ఈ ద్రావణం ఒక లీటరు సేకరించాలంటే.. దాదాపు 20వేల మొగలి పువ్వులు కావాలి. ఈ ద్రావణాన్ని కాస్మెటిక్స్, ఔషధాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అంతేకాదు కీళ్ల సంబంధిత వాత నొప్పులు తగ్గిస్తుందని చెబుతుంటారు. ఈ మొగలి పువ్వుల నుంచి తీసే ద్రావణాన్ని ఒడిశాలోని అగర్‌బత్తీల తయారీకి కూడా పంపిస్తుంటారు. ఈ మొగలి సాగు కూడా వ్యవసాయ అనుబంధంగా ఉందని.. తమకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తే బావుంటుందని రైతులు కోరుతున్నారు.వాస్తవానికి సముద్ర తీర ప్రాంతాలతో పాటుగా కొబ్బరి, జీడిమామిడి తోటలకు రైతులు కంచెలా ఈ మొగలి మొక్కల్ని పెంచుతుంటారు. పొలం గట్లపై, కాలవ గట్లపై కనిపించే ఈ మొగలి చెట్లు ఇప్పుడు రైతులకు ఆదాయాన్ని తీసుకొచ్చేవిగా మారాయి. కొంతమంది రైతులు కొబ్బరి తోటలతో నష్టాలు వచ్చాయని.. వాటిని తొలగించి మొగలి మొక్కల్ని నాటుతున్నారు. ఈ పుష్పాల ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతులు మాత్రమే కాదు మరికొన్ని చోట్ల కూడా కొంతమంది మొగలి సాగుకు సిద్ధమవుతున్నారు.

# హస్తం ముందే చేతులు ఎత్తేసిందా..

కడప, అక్టోబరు 10,: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయాలనే అనుకుంటోంది. కానీ ఇంత వరకూ దానికి సంబంధించి కార్యాచరణ ను మాత్రం సిద్ధం చేయడం లేదు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లోనూ ఒంటరిగా లేదా కలసి వచ్చే భాగస్వామ్య పక్షాలతో కలిసి గానీ పోటీ చేయాలనే బలమైన ఉద్దేశంతో పార్టీ ఉంది. కానీ క్షేత్రస్థాయిలో నేతల పర్యటనలు లేవు. ఆంధ్రప్రదేశ్ చీఫ్ వైఎస్ షర్మిల కూడా పెద్దగా స్థానిక సంస్థల ఎన్నికలను పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఇప్పటికే కూటమిలోని మూడు ప్రధాన పార్టీలు, వైసీపీలు వరసగా నేతలతో సమావేశాలు పెడుతూ అభ్యర్థుల ఎంపికతో పాటు ప్రచారం, సమన్వయం వంటి అంశాలపై చర్చిస్తున్నారు. కాని కాంగ్రెస్ పార్టీ మాత్రం క్షేత్ర స్థాయిలో సమావేశాలు పెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా నిలబడితేనే కనీసం ఓటు బ్యాంకు పెంచుకోవడానికి వీలవుతుంది. అప్పటికప్పుడు బీ ఫారంలు పంపిణీ చేసినంత మాత్రాన వారు పర్మినెంట్ నేతలు కారు. అభ్యర్థుల ఎంపికలోనూ జాగ్రత్తలు పాటించాలి.మ్యాప్‌లు చూడండి. కానీ ఇప్పుడు మాత్రం ఏపీ కాంగ్రెస్ లో ఆ ఛాయలే కనిపించడం లేదు. వైఎస్ షర్మిల తన ఇంట్లో జరిగే శుభకార్యం విషయంలో బిజీగా ఉన్నారు. మిగిలిన సీనియర్ నేతలయినా పట్టించుకుని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కొందరు నేతలను కలిసే ప్రయత్నమూ చేయకపోవడం ఈ అనుమానాలకు తావిస్తుంది. అసలు పోటీ చేయాలంటే కేవలం బీ ఫారం ఉంటే సరిపోదు. అందుకు సరైన అభ్యర్థి ఉండాలి. ఎన్నికల



సమయంలో ప్రచారానికి వెళ్లినా అది వర్క్ అవుట్ కాదు. పట్టున్న నేతలు స్థానికంగా ఎవరినో గుర్తించి వారికి టిక్కెట్ ఇస్తామని చెప్పి రంగంలోకి దించాలి. ఇప్పుడు ఆలస్యం చేసే ఉన్న కొద్ది మంది నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రమాదాలు కూడా ఉన్నాయి. అసలే కాంగ్రెస్ కు ఆంధ్రప్రదేశ్ లో ఓటు బ్యాంకు తక్కువగా ఉంది. ఇటువంటి సమయంలో ఇలాంటి చర్యలతో పార్టీ పరిస్థితి మరింత దిగజారే అవకాశముందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ పి.వి. మోహన్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ కార్యవర్గ, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశాల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల స్థానాల్లో పోటీ చేయాలని అధికారికంగా తీర్మానించారు. కేవలం తీర్మానం చేస్తే సరిపోదు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి. తామున్నామంటూ ద్వితీయ శ్రేణినేతలకు భరోసా ఇవ్వాలి. ఎన్నికల నిర్వహణ కోసం ప్రతీ జిల్లాలో మాజీ డీసీసీ అధ్యక్షులు, పీఏసీ సభ్యులు, సీనియర్ నాయకులతో కూడిన జిల్లా ఎన్నికల కమిటీలను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేస్తోంది. బీజేపీ, అధికార ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఉన్న శక్తులను ఏకం చేసేందుకు, 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు మరియు ఇతర భావసారూప్యత గల సంస్థలతో పొత్తులపై చర్చలు జరిపేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని కూడా నియమించారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలని, తద్వారా రాష్ట్రంలో తమ ఉనికిని గట్టిగా చాటుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది.కాబట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం పోటీ చేయడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని సీట్లలోనూ అభ్యర్థులను నిలబెట్టాలనే పక్కా ప్రణాళికతో కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. కానీ కనీసం పోటీ ఇచ్చే నేతలను ఎంపిక చేయడమే కాంగ్రెస్ కు అసలైన సవాల్.

# కేంద్రనిధులతో పకడ్బందీగా గ్రామీణం

విజయవాడ, అక్టోబరు 10 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన శాఖలో పట్టు పెంచుకున్నారు. వరసగా కేంద్ర నిధులను తెచ్చి కొంత ప్రజల్లోనూ గ్రిప్ పెంచుకుంటున్నారు. పాలనాపరమైన విజయాలు మరియు నిర్ణయాల్లో ఆయన ప్రత్యేక అధికారి మరియు కీలక బృందం ఎంతో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన శాఖల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో మరియు ప్రజా సమస్యలకు వేగంగా స్పందించడంలో ఈ అధికారుల పాత్ర కీలకంగా మారింది. పవన్ కళ్యాణ్ తాను ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కీలకమైన గ్రామీణ, పంచాయతీరాజ్ శాఖలను తీసుకున్నారు. అటవీ శాఖను అడిగి మరీ తన వద్ద ఉంచుకున్నారు. దీంతో పాటు కేరళ క్యాడర్ కు చెందిన కృష్ణ చైతన్యను తన ఓఎస్డీగా నియమించుకున్నారు. కేరళ కేడర్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి కృష్ణ తేజ పవన్ కళ్యాణ్ ఓఎస్డీగా నియమితులయ్యారు. ఆయన వాస్తవంగా ఏపీ వాసి కావడంతో పని మరింత సులువయింది.మ్యాప్‌లు చూడండి కేరళ వరదల సమయంలో సమర్థవంతంగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న కృష్ణ తేజ, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖల వ్యూహాలను రూపొందించడంలో, క్షేత్రస్థాయిలో వాటిని సమర్థవంతంగా అమలు చేయడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. గ్రామాలకు రక్షిత మంచినీటితో పాటు రహదారులు వంటి మౌలిక



సదుపాయాల కల్పనలో పవన్ కు చేదోడు వాదోడుగా ఉంటూ ఒక విధంగా ఆయనకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రాష్ట్రానికి రప్పించడంలో ప్రధాన పాత్ర పోషించారు. జల్ జీవన్ మిషన్ తో పాటు గిరిజన గ్రామాలకు రహదారులను నిర్మించడంతో పాటు పంచాయతీలక నిధులను కేటాయిస్తూ పవన్ కళ్యాణ్ గ్రామాల్లో పట్టు పెంచుకునేందుకు ఈ రకమైన సలహాలు ఉపయోగపడ్డాయనే చెప్పాలి. సమర్థవంతులైన అధికారులను గుర్తించి మరీ పవన్ కళ్యాణ్ తన పేషీలోకి, తన శాఖల పరిధిలోకి తీసుకున్నారు. అవినీతి మచ్చలేని అధికారులను రప్పించుకున్న పవన్ కళ్యాణ్ తమ శాఖ ద్వారా చేపడుతున్న పనులు ప్రజామోదం పొందేలా చూసుకోగలుగుతున్నారు. అందులో పంచాయతీరాజ్ ఈ ఎన్ సీ కూడా ఒకరంటున్నారుఇక గతంలో కడప, ధర్మవరం ప్రాంతాల్లో ఆర్డీఓగా పనిచేసిన అనుభవజ్ఞుడైన అధికారి మధుసూదన్ కూడా పవన్ కళ్యాణ్ టీంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం, పరిపాలనాపరమైన లోటుపాట్లు లేకుండా చూసుకోవడంలో ఈయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అడవులు మరియు పర్యావరణ శాఖలకు సంబంధించిన ఫైళ్లను నిశితంగా పరిశీలించి, పారదర్శకమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ బృందం సహాయపడుతోంది.క్షేత్రస్థాయి నుండి వచ్చే ప్రజల వినతులను వేగంగా పరిశీలించి, వాటికి తక్షణ పరిష్కారాలు చూపేలా యంత్రాంగాన్ని నడిపించడంలో వీరి వ్యూహాలు పవన్‌కు బాగా కలిసివచ్చాయి. పవన్ కళ్యాణ్ రాజకీయ దార్శనికతకు, అనుభవజ్ఞులైన ఐఏఎస్ మరియు ప్రభుత్వ అధికారుల పరిపాలనా నైపుణ్యం తోడవడంతో ప్రభుత్వంలో మరియు ప్రజల్లో జనసేన అధినేత గ్రాఫ్ మరింతగా పెరిగింది. మొత్తంగా చెప్పాలంటే, పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యూహాలకు ఈ అధికారుల పరిపాలనా సామర్థ్యం తోడవడంతో డిప్యూటీ సీఎంగా ఆయన విజయవంతమైన ప్రస్థానంలో ఓఎస్డీల పాత్ర అత్యంత కీలకంగా మారింది

# నెల్లూరు మేయర్ అభ్యర్థి ఖరారు...

నెల్లూరు, అక్టోబరు 10 : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరానికి సంబంధించి



అధికారిక నోటిఫికేషన్, రిజర్వేషన్ల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాకముందే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ ఆనం విజయ్‌కుమార్ రెడ్డి పేరును పార్టీ తరపున అధికారికంగా ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైసీపీ ప్రకటించిన మొట్టమొదటి మేయర్ అభ్యర్థి ఆనమే.ఆనం కుటుంబంలో చాలా కాలం క్రితమే చీలిక వచ్చింది. ఆనం విజయ్ కుమార్ రెడ్డితో ఇతర సోదరులకు సంబంధాల్లేవు. విజయ్‌కుమార్ రెడ్డి చాలాకాలంగా పార్టీలోనే కొనసాగుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల వేళ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీలోకి ఫిరాయించడంతో, నెల్లూరు రూరల్ బాధ్యతలను జగన్ ఆయనకే అప్పగించారు. అటు ఆనం విజయ్‌కుమార్ రెడ్డి సతీమణి అరుణమ్మ గతంలో నెల్లూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆనం కుటుంబానికి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాత పరిచయాలు, బలమైన క్యాడర్ బలం కార్పొరేషన్ పోరులో పార్టీకి ఉపయోగపడుతుందన్న లెక్కలతోనే జగన్ ఈ ముందస్తు ప్రకటన చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.నెల్లూరు వైసీపీలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఆదాల ప్రభాకర్ రెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి వర్గాల మధ్య సమన్వయం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ఎవరి వాదన వినకుండా ఆనం విజయ్ కుమార్ ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల నగరంలోని ఇతర వర్గాల ఆశావహులు, ద్వితీయ శ్రేణి నేతలు ఏ మేరకు సహకరిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. టీడీపీ తరపున నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ, రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఎమ్మెల్యేలుగా చక్రం తిప్పుతూ క్షేత్రస్థాయిలో తిరుగులేని పట్టు సాధించారు. ధికార పక్షాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక, అంగబలాన్ని సమకూర్చుకోవడం వైసీపీకి పెను సవాలే. అంతర్గత గ్రూపు విభేదాలను చక్కదిద్దకుండా, రిజర్వేషన్లు తేలకుండానే ముందస్తుగా విసిరిన ఈ మేయర్ పాచికతో జగన్ పార్టీ కేడర్‌ను ఎన్నికల సమరానికి సిద్ధం చేయగలరా లేక అసంతృప్తుల రూపంలో కొత్త తలనొప్పులు కొనితెచ్చుకున్నారా అన్నది వేచి చూడాలి.

# ఈసీ వర్సెస్ సుప్రీం

ఢిల్లీ : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు.జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింభారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నాయకత్వం [?] ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఫారం 6 వివాదం ముదురుతోంది. ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని తాజాగా సుప్రీం కోర్టు చేసిన హెచ్చరికలతో ఈసీ చిక్కుల్లో పడింది. ఫారం-6 సవరణలను తాము ఆమోదించలేదని, అవి చట్టవ్యతిరేకంగా ఉంటే రద్దు చేస్తామని నిన్న (సోమవారం) సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించిన విషయం




తెలిసిందే. ఫారం-6ను కొత్త ఓటర్ల నమోదు కోసం వినియోగిస్తారు. అయితే దీనిలో ఏకపక్షంగా సవరణలు చేశారని దేశవ్యాప్తంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫారం 6లో.. గత ఎస్ఐఆర్‌లో తమ పేరు/ తల్లిదండ్రుల పేరు/ తాత, నానమ్మల పేరు ఉందా అన్న విషయం తెలపాలంటూ ఈసీ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం కోర్టు ఘాటుగా స్పందించింది. ఆ సవరణలను తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది.మరోవైపు ఫారం-6 ఎలాంటి సవరణలూ చేయలేదని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. తాము అదనంగా ఒక డిక్లరేషన్‌ను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పింది. పైగా ఈ మార్పులను బిహార్ 'సర్'పై ఇచ్చిన మే నెల తీర్పులో సుప్రీం కోర్టు కూడా సమర్థించిందని తెలిపింది.కాగా.. ఈసీఐ అధికారిక పోర్టల్‌లో ఫారం-6కు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అదనపు డిక్లరేషన్ తప్పనిసరిగా జతచేయాలి. ఇందుకోసం ఆ పోర్టల్‌లో 'ఫిల్ ఫారం-6', 'ఫిల్ డిక్లరేషన్' అని రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇప్పుడు దీనిపై వివాదం రాజుకోవడంతో డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ తొలగించింది. ఇప్పుడు దీన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది, ఎవరి ఆదేశాలతో ఆ పత్రాన్ని తప్పనిసరి చేశారని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీ పలు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మరో వైపు ఏఐఎంఐఎం ప్రెసిడెంట్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ విషయంపై స్పందించారు. ఫామ్ 7 దరఖాస్తుల పేరుతో ఓట్లు తొలగించాలని చూస్తే పెద్దఎత్తున ఆందోళనలకు దిగుమతామని హెచ్చరించారు. ఫామ్ 7 పేరుతో తప్పుడు దరఖాస్తులు లేదా అప్పీళు „ సమర్పిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి" అని కోరారు.ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది."ఫామ్ 7 దరఖాస్తుల విషయంలో అనర్హమైనవి సమర్పిస్తే తగిన చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లకు సూచించారు.మరోవైపు, 'సర్' ప్రక్రియలో భాగంగా కర్ణాటకలో ఫామ్ 7 కింద దాదాపు నాలుగువేలకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని,వారిలో ఎక్కువ మంది ముస్లిం ఓటర్లు ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. .మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

## ఎక్స్పైరీ సరుకులపై ప్రశ్నిస్తే.. ఐడీలు బ్లాక్ చేస్తారా?

**- హస్తినాపురం ఇన్స్టామార్ట్పై డెలివరీ రైడర్ల ఆరోపణలు**

**- కనీస సౌకర్యాలు కూడా లేవంటూ ఆవేదన.. విచారణకు డిమాండ్**

ఎల్బీనగర్: హస్తినాపురం జడ్పీ రోడ్డులోని ఇన్స్టామార్ట్పై అక్కడ పనిచేస్తున్న కొందరు డెలివరీ రైడర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కస్టమర్లకు డెలివరీ చేస్తున్న సరుకుల విషయంలో అనుమానాలు వ్యక్తం చేసి యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు తమపై వేధింపులకు పాల్పడుతున్నారని రైడర్లు ఆరోపిస్తున్నారు.

ఎక్స్పైరీ సరుకులపై ప్రశ్నించడంతో ఐడీలు బ్లాక్?

ఎక్స్పైరీ తేదీ దాటిన సరుకులు కస్టమర్లకు పంపుతున్నారనే అనుమానంతో ప్రశ్నించగా.. తమ స్విగ్గి ఇన్స్టామార్ట్ రైడర్ ఐడీలను బ్లాక్ చేశారని పలువురు రైడర్లు చెబుతున్నారు. తమ ఐడీలను ఎందుకు బ్లాక్ చేశారనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుడు కేసుల భయపెడుతున్నారంటూ ఆరోపణలు

తమను భయపెట్టేందుకు తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని రైడర్లు ఆరోపిస్తున్నారు. అక్కడ పనిచేసే మహిళా సిబ్బందిని ఉపయోగించి తమపై కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వారు వాపోతున్నారు. అయితే ఈ ఆరోపణలపై యాజమాన్యం స్పందన తెలియాల్సి ఉంది.

కనీస సౌకర్యాలు కూడా లేవు..

రోజంతా ఎండ, వానను లెక్కచేయకుండా రోడ్లపై తిరుగుతూ డెలివరీలు చేసే తమకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని రైడర్లు చెబుతున్నారు. తాగునీరు, వాష్రూమ్ వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీమ్ లీడర్లు, మేనేజర్లకు చెప్పినా స్పందన లేదంటూ ఆవేదన

తమ సమస్యలను టీమ్ లీడర్లు, మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లభించడం లేదని రైడర్లు అంటున్నారు. పని ఒత్తిడి, డెలివరీ సమస్యలు, ఐడీ బ్లాకింగ్ వంటి అంశాలపై తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని చెబుతున్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలకు డిమాండ్

ఎక్స్పైరీ అయిన వస్తువులు ఆన్లైన్ ద్వారా కస్టమర్లకు చేరుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే.. ఇది వినియోగదారుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశంగా మారుతుంది. దీంతో హస్తినాపురం ఇన్స్టామార్ట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైడర్లు, స్థానికులు కోరుతున్నారు.

ఐడీలు అన్బ్లాక్ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి

గిగ్ వర్కర్ల భద్రత, సంక్షేమంపై చర్చ జరుగుతున్న సమయంలో.. రోజంతా రోడ్లపై పనిచేసే డెలివరీ రైడర్లకు కనీస సౌకర్యాలు లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమ రైడర్ ఐడీలను వెంటనే అన్బ్లాక్ చేసి, సమస్యలపై న్యాయం చేయాలని రైడర్లు కోరుతున్నారు. హస్తినాపురం ఇన్స్టామార్ట్లో ఎక్స్పైరీ సరుకుల ఆరోపణలు, రైడర్ ఐడీల బ్లాకింగ్, తప్పుడు కేసుల ఆరోపణలు, కనీస సౌకర్యాల కొరతపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని రైడర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భూగర్భ విద్యుత్.. 6 వేల కి.మీ.కుపైగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్

హైదరాబాద్, అక్టోబరు 10 : హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్ట్ చేపట్టింది. ౧ఉూఖఆఅఒ ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 అమలు కానుంది. ఇందులో సుమారు 311 కిలోమీటర్ల 33 కేవీ, 5,772 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. చెట్లు, గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతోపాటు వీధుల్లో భద్రత, నగర సౌందర్యం, స్మార్ట్ గ్రిడ్ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ౧ఉూఖఆఅఒ అధికారులు ట్విట్టర్ ఎక్స్ ద్వారా వెల్లడించారు.ప్రపంచ స్థాయి నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలో ప్రస్తుతం ్తంభాలపై ఉన్న విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చే హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1ను చేపడుతోంది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా.. నగర విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఫేజ్-1లో సుమారు 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, దాదాపు 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి తరలించనున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, ప్యారడైజ్, కంటోన్మెంట్, మెహదీపట్నం, చార్మినార్, బేగంబజార్,



బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లు ఈ తొలి దశలో భాగంగా ఉన్నాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలోని 11 డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. భూగర్భ కేబులింగ్‌తో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎదురయ్యే అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాలు, పిడుగుల ప్రభావంతో విద్యుత్ లైన్లు దెబ్బతినే సందర్భాలు ఉంటాయి. కేబుళ్లు భూగర్భంలోకి వెళ్లడంతో ఇలాంటి బాహ్య ప్రభావాల నుంచి విద్యుత్ వ్యవస్థకు రక్షణ లభిస్తుంది. ఫలితంగా విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా కొనసాగించేందుకు వీలవుతుందని ౧ఉూఖఆఅఒ అధికారులు వెల్లడించారు.అదే సమయంలో రోడ్ల పక్కన, ఇళ్లకు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగ్గడంతో ప్రజల భద్రత కూడా మెరుగుపడనుంది. బాల్కనీలు, ఇళ్లు, ఫుట్‌పాత్‌లకు సమీపంలో ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్ల సమస్య తగ్గడంతో పాటు స్తంభాల సంఖ్య తగ్గడం వల్ల పాదచారులకు మరింత స్థలం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా చారిత్రక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల పరిసరాల్లో తీగల గందరగోళం తగ్గడం నగర సౌందర్యాన్ని పెంచే అంశంగా మారనుంది. ఈ ప్రాజెక్ట్‌లో స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ూఅంఆం ఆధారిత రింగ్ మెయిన్ యూనిట్లు అందుబాటులోకి రావడంతో విద్యుత్ నెట్‌వర్క్‌లో లోపాలను వేగంగా గుర్తించి, ప్రభావిత ప్రాంతాన్ని వేరు చేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. భూగర్భ కేబుళ్లకు అనధికారికంగా కొక్కేలు వేయడం కష్టంగా ఉండటంతో విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించడంలోనూ ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. మొత్తంగా భూగర్భ కేబులింగ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, అందమైన, ఆధునిక విద్యుత్ వ్యవస్థ కలిగిన నగరంగా తీర్చిదిద్దే దిశలో కీలక అడుగుగా నిలవనుంది. భవిష్యత్తులో నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మరింత పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించే అవకాశం ఉంటుంది.

# నవంబర్ 2వ వారం నుంచి కాళేశ్వరం పనులు

కరీంనగర్, అక్టోబరు 10 : కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి కొత్త డిజైన్లను సమర్పిస్తామని, ఆ తరువాత సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణం నాణ్యత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను అత్యంత పటిష్ఠం చేస్తామని, ఈ మూడింటిలో నీటి నిల్వతో పాటు వినియోగ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి రైతులకు సాగునీరు నీరందిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు



( ఐఒఎఖ) భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి నదిపై నిర్మించిన ఒక బహుళార్ధసాధక నీటిపారుదల ప్రాజెక్టు. ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల ప్రాజెక్టు. 2016లో శంకుస్థాపన చేయగా, తొలి దశ 2019 జూన్ 21న అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు 13 జిల్లాల గుండా సుమారు 500 కి.మీ (310 మైళ్ళు ) దూరం విస్తరించి ఉంది. ఈ ప్రాజెక్టు మొత్తం 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అందించడమే లక్ష్యం. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 195, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20, భూగర్భ జలాల నుంచి 25). ఇందులో 169 టీఎంసీలను రైతులకు సాగునీటి కోసం, 30 టీఎంసీలను హైదరాబాద్ నీటి అవసరాలకు, 16 టీఎంసీలను ఇతర పారిశ్రామిక అవసరాలకు, 10 టీఎంసీలను సమీప గ్రామాలకు తాగునీటి కోసం కే టా ం ౨ ౦ ం చా ర ౦ . నీ టి ని ఎత్తిపోయడానికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే 3 ప్రధాన బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023లో మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగడంతో ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పగుళ్లకు రిపేర్లు చేపించాలని బీఆర్ఎస్ చెబుతంటే.. భారీ స్కామ్ చేసి దోచుకున్నారని కేసీఆర్ ఫ్యామిలీ మీద కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టు లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పించడం బీఆర్ఎస్ పార్టీకి మైనస్ అయింది. ప్రాజెక్టు సేఫ్టీ మీద అనుమానంతోనే గత మూడేళ్లుగా బ్యారేజీల నుంచి తెలంగాణ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడం లేదు. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతున్నాయని తెలిసిందే

# పనితీరుపై రేవంత్ నజర్



హైదరాబాద్, అక్టోబరు 10 : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మపరిశీలనకు సిద్ధమైంది. ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా నేతల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అత్యంత రహస్యంగా పావులు కదుపుతోంది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ సహా పలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇంటెలిజెన్స్ ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజా నాడిని ముందుగానే పట్టుకుని, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్టు తెలుస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక తమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి.. తమ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. అనే అంశాలపై ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీల ద్వారా నిఘా పెడుతుంటాయి. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏకంగా ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో లోతుగా ఆరా తీస్తోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ఈ సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సర్వేలో కేవలం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరు మాత్రమే కాకుండా, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పాలనా శైలిపై కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఏ ఏ పథకాలపై సానుకూలంగా ఉన్నారు? వేటిపైన అసంతృప్తితో ఉన్నారు.. లాంటి అంశాలను గుర్తించి.. సరిదిద్దుకేవడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.గత ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ సర్వేలో ప్రజలను ప్రధానంగా అయిదు నుంచి ఏడు రకాల కీలక అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే బాగుంటుంది? ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే దానికి గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలను సంధించడం ద్వారా ప్రతిపక్షాల వైపు ప్రజల మొగ్గు ఎలా ఉందో అంచనా వేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా పనితీరు, ఉచిత పథకాలు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి సమస్యాత్మక అంశాలపై ప్రజల స్పందనను ఇంటెలిజెన్స్ వర్గాలు కూలంకషంగా సేకరిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ఎంతవరకు జనాల్లోకి వెళ్లాయనే కోణంలోనూ ఈ సర్వే వివరాలు రాబడుతోంది. అదే సమయంలో, కొన్ని వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత, ఉచితాలకు వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఈ డేటా ప్రభుత్వానికి అత్యంత కీలకం కానుంది. ఎన్నికల సమయానికి ముందే ప్రజా వ్యతిరేకతను తగ్గించి, పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఇంటెలిజెన్స్ సర్వేను ఒక అస్త్రంగా మలుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

# 100 శాతం స్ట్రైక్ రేటే లక్ష్యం

విజయవాడ అక్టోబరు 8, : ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే వ్యూహాత్మక ఫోకస్ పెట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటి సీట్ల సర్దుబాటు ఫార్ములాను కాకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ బలాన్ని బట్టి మెరుగైన స్థానాలు సాధించడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు. ఒకవేళ లైట్ గా తీసుకుంటే ఈ ఎన్నికలు సరే.. వచ్చే శాసనసభ ఎన్నికల్లో జనసేన భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. పవన్ కల్యాణ్ నాయకత్వాని స్థానిక సంస్థల ఎన్నికలు ఒక పరీక్ష అని చెప్పాలి. ఎందుకంటే ఆయనను నమ్మి పన్నెండేళ్ల నుంచి నడిచిన వారు నేడు కూడా పదవులు పొందకపోతే ఇక రాజకీయాల్లో కొనసాగకపోవచ్చు. వారిలో నైరాశ్యం నిండుకుంటే ఆ ప్రభావం జనసేనపైనే ఎక్కువ ప్రభావం పడుతుంది. ఇప్పటికే పవన్ కల్యాణ్ తన సొంత సామాజికవర్గమైన కాపులకు ఒకింత దూరంగా వ్యవహరిస్తున్నారు. ఇక మిగిలింది పార్టీ కార్యకర్తలు. అభిమానులు. ఆయన అభిమానులు పదవులను ఆశించరు. కానీ పార్టీ నేతలు మాత్రం పదవుల కోసమే ఇంతకాలం ఓపిగ్గా వేచి ఉన్నారు. ఇప్పటికే కొందరు ఓపెన్ అయిపోతున్నారు. తమకు సీటు రాకుంటే ఇండిపెండెంట్ గా పోటీ చేస్తామని హెచ్చరిస్తున్నారు.. అందుకే పవన్ కల్యాణ్ నిన్న చంద్రబాబు తో సుదీర్ఘంగా చర్చించారు. పన్నెండేళ్ల నుంచి కష్టపడిన కార్యకర్తలకు ఏదో ఒక పదవి దక్కాలని పవన్ కల్యాణ్ కూడా ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల సన్నద్ధతలో



భాగంగా పవన్ కళ్యాణ్ అండ్ టీమ్ తీసుకుంటున్న నిర్ణయాలు ఒకింత కటువుగానే ఉంటాయన్న అభిప్రాయం పార్టీ నేతల్లో నెలకొంది. ఆ అభిప్రాయాన్ని నెలకొల్పింది పవన్ కల్యాణ్ మాత్రమే. ఈసారి రాజీ పడబోమని, గెలిచే స్థానాల్లో ఖచ్చితంగా పోటీ చేస్తామని, అవసరమైతే స్నేహపూర్వక పోటీకి దిగుతామని చెప్పి వారికి ఒక ఉప్పందించినట్లయింది. దీంతో తమకు సీటు రాకపోయినా పోటీ చేయవచ్చన్న భావన ఎక్కువ మంది జనసేన నేతల్లో ఉంది. టీడీపీ స్థానిక నాయకత్వం ఎలాగూ ఒప్పుకోదు. ఆ సమయంలో తాము బరిలోకి దిగి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే తమ బలం ఏంటో చూపించాలని చాలా మంది ద్వితీయ శ్రేణి నేతలు భావిస్తున్నారు. ఇందుకోసం తమ అనుచరులు, సన్నిహితులతో సమావేశాలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. పవన్ కల్యాణ్ చెప్పిన తర్వాతే ఇలాంటి సమావేశాలు ఎక్కువవుతున్నాయి. . నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మధ్య సీట్ల సర్దుబాటు, మేయర్ అభ్యర్థుల ఎంపిక, మరియు సమన్వయ కమిటీల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. 100 శాతం విజయాలే లక్ష్యంగా ఏ ఒక్క స్థానం కూడా ప్రతిపక్షాల ఖాతాలోకి వెళ్లకుండా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని ఇరు నేతలు నిర్ణయించారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం పవన్ కళ్యాణ్ ఇప్పటికే ప్రత్యేకంగా సమన్వయ కమిటీలను ప్రకటించారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో పార్టీకి సరికొత్త జోష్ ఇచ్చేందుకు వీలుగా పాత పార్లమెంట్ కమిటీలను రద్దు చేసి, నిరంతరం ప్రజల్లో ఉండే యాక్టివ్ లీడర్లతో నూతన కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తున్నారు.గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలకు, వీరమహిళలకు స్థానిక ఎన్నికల ద్వారా తగిన గుర్తింపు, రాజకీయ అవకాశాలు కల్పించడమే పవన్ కళ్యాణ్ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన సీట్ల ఫార్ములా కాకుండా, ఆయా నియోజకవర్గాల్లో జనసేనకు ఉన్న సంస్థాగత బలాన్ని బట్టి సీట్లు డిమాండ్ చేయాలని పార్టీ నేతలకు సూచించారు.అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసే ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగరేసేలా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. మరి చివరకు పవన్ ఈ ఎన్నికల సర్దుబాటులో ఎంత మేరకు సక్సెస్ అవుతారో చూడాల్సి ఉంది.



# 14న సింహగర్జన

అదిలాబాద్, అక్టోబరు 10 : సింగరేణి కాలరీస్ కంపెనీలిమిటెడ్ మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. సింగరేణి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫలమైందంటూ అక్టోబర్ 14న రామగుండం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' నిర్వహించబోతోంది. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్ రావు తదితరులు హాజరవుతున్నారు.సింగరేణి లాభాల్లో కార్మికులకు దక్కే వాటా గణనీయంగా తగ్గిపోయిందనేది బీఆర్ఎస్ ప్రధానంగా ఆరోపిస్తోంది. గత బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు ఏకంగా 32 శాతం లాభాల వాటా అందిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆ వాటా 16 శాతానికి, ఆ తర్వాత 2024-25 నాటికి 12.5 శాతానికి పడిపోయిందని హరీష్ రావు ఆరోపించారు. దసరాకు ముందే లాభాలు, వాటాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ, ఈసారి ఆ సంప్రదాయానికి తూట్లు పడ్డాయని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.సింగరేణి ఆర్థిక పరిస్థితిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ. 4,712 కోట్ల లాభాలను ఆర్జించగా, 2024-25 నాటికి అవి రూ. 6,394 కోట్లకు చేరాయని బీఆర్ఎస్ చెప్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం లాభాలు రూ. 1,800 కోట్లకు మించే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలు, టెండర్లలో జాప్యం, భారీ వ్యయంతో కూడిన కాంట్రాక్టుల కారణంగానే సంస్థ ఈ దుస్థితిని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వాదిస్తోంది. మరోవైపు.. బ్యాంకుల్లో రూ. 6,323 కోట్లు నిల్వ ఉన్నప్పటికీ, అదనంగా 4,000 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి బొగ్గు గనుల ప్రాంతాలు ఏ పార్టీ రాజకీయ భవిష్యత్తునైనా నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు సింగరేణి కార్మికులను కూడగట్టడం ద్వారా ఉత్తర తెలంగాణలో మళ్లీ పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గతంలో తమ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందిన సంక్షేమం, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోల్చి చెప్పడం ద్వారా కార్మిక లోకంలో సానుభూతిని పొందడమే లక్ష్యంగా ఈ 'కార్మిక గర్జన' రూపుదిద్దుకుంటోంది.మొత్తానికి? రామగుండం వేదికగా జరగనున్న ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న వ్యూహాత్మక అడుగుగా పరిశీలకులు భావిస్తున్నారు. కార్మిక సమస్యల పేరుతో తెరపైకి వస్తున్న ఈ రాజకీయం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

# ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలపై చంద్రబాబు సీరియస్

విజయవాడ, అక్టోబరు 10, : టీడీపీ అధిష్టానం ఇద్దరు ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరువూరులో టీడీపీ నేతల మధ్య వివాదం, దెందులూరులో టోల్



ప్లాజా ఘటనలపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరా తీశారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య మధ్య వివాదంపై చర్చించారు. కొలికపూడి బాలకోటయ్య నుంచి వివరాలు, వివరణ కోరారు. ఇటు చింతమనేని నుంచి టోల్‌ప్లాజా ఘటనపై వివరణ తీసుకున్నారు.ఏపీలో టీడీపీ నేతల వరుస వివాదాలపై అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది.. ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటుగా మరో నేతను పిలిచి వివరణ తీసుకుంది. మరోసారి ఇలాంటివి జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించింది. కొద్దిరోజులుగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు , ఏపీ సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్యల మధ్య వివాదం రేగింది. కొలికపూడి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేశారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని బాలకోటయ్య అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దమ్ముంటే తాను టీచర్‌పై దాడి చేశానని నిరూపించాలని.. లేకపోతే బాలకోటయ్య కార్యాలయం వద్ద ఆందోళన చేస్తానని కొలికపూడి కౌంటర్ ఇచ్చారు. కొద్దిరోజులుగా ఇద్దరు నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు.ఇద్దరు నేతలపై టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం చేసేలా వ్యవహరిస్తు?న్నారని.. ఇద్దరిని పిలిచి మాట్లాడాలని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించింది. ఆయన బాలకోటయ్యను, కొలికపూడి శ్రీనివాసరావును పిలిచి మాట్లాడారు. ఇటీవల జరిగిన పరిణామాలపై ఇద్దరు నేతల నుంచి విడివిడిగా వివరణ తీసుకున్నారు. ఇద్దరి కారణంగా కొత్త తలనొప్పులు వస్తున్నాయని.. ఇలాంటి వ్యవహారశైలం మంచిది కాదని పల్లా హెచ్చరించారు. ఇలాంటి వాటిని పార్టీ సహించదని తేల్చి చెప్పారు.. పార్టీకి నష్టం చేసేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. ఒకవేళ నేతల మధ్య ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అవన్నీ మానేసి ఇలా పదే, పదే రచ్చకెక్కడం సరికాదన్నారు.కొలికపూడి, బాలకోటయ్య వివాదంతో పాటుగా మూడు రోజుల క్రితం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పైనా కొన్ని ఆరోపణలు వచ్చాయి. వెదురుపావులైరు టోల్‌ప్లాజా దగ్గర టిప్పర్ల డ్రైవర్లు టోల్ ఛార్జీలు చెల్లించకుండా కొద్దిసేపు హంగామా చేశారు. ఈ టిప్పర్లు చింతమనేని ప్రభాకర్‌వి అంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ అంశం వివాదం కావడంతో అధిష్టానం ఆరా తీసింది. వివరణ ఇవ్వాలంటూ చింతమనేనిని ఆదేశించగా.. ఆయన పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వివరణ ఇచ్చారు. టోల్‌ప్లాజా దగ్గర టిప్పర్లకు తనకు సంబంధం లేదని.. అవి తనవి కాదని, డ్రైవర్లతో కూడా సంబంధం లేదని చింతమనేని వివరణ ఇచ్చారు. తనకు సంబంధం లేని వివాదంలోకి లాగుతున్నారని పల్లాతో చెప్పారు. వ్య క్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలకు దూరంగా ఉంటూ పార్టీ క్రమశిక్షణ, ఐక్యతను కాపాడాలని నేతలకు పల్లా సూచించారు. టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు వివాదాలకు దూరంగా ఉండాలని పదే, పదే హెచ్చరిస్తోంది.. అయినా సరే నేతలు ఇటీవల కాలంలో వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు.

# దసరా నవరాత్రుల వేళా ...

**- అమ్మ వారి విగ్రహ ఏర్పాటు విషయంలో ఇరు వర్గాల మధ్యగొడవ....**

**- మహిళలు తో సహా తుక్కు తుక్కు గా కొట్టుకున్న వైనం**

పల్నాడు : రాజుపాలం మండలం దేవరంపాడు లో ఇరు వర్గాల వైరం ఘర్షణకు దారి తీసింది. రామారావు వెర్సెస్ శ్రీను వర్గం పరస్పర దాడులకు దిగాయి. దేవరంపాడు గ్రామాలోని రామాలయంలో బతుకమ్మ విగ్రహం ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దసరా సందర్భంగా ఆలయంలో విగ్రహం ఏర్పాటు చేయాలని ఒక వర్గం, అందుకు అంగీకరించేది లేదని మరో వర్గం పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. విగ్రహాన్ని ఆలయం వద్దకు తీసుకురావడంతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో 10 మందికి స్వల్ప గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కామారెడ్డిలో నూతనంగా మీనాక్షి హాస్పిటల్ ప్రారంభం

**- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 10(విజన్ఆంధ్ర) కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మీనాక్షి హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు శు భాకాంక్షలు తెలిపారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని, పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నూతన ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వైద్య రంగంలో సేవాభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన చికిత్స అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, పండ్ల రాజు, అశోక్ రెడ్డి, చాట్ల రాజేశ్వర్, నరేందర్ రెడ్డి కౌన్సిలర్లు లడ్డు, సత్యం, సిద్దిక్, అంజాద్, చిట్టిబాబు, గంగాధర్, ముబషీర్, గౌనె శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, రాజగౌడ్, మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూమని బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, నౌసిలాల్, గణేష్ నాయక్, రాము కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ హక్కుల పరి రక్షణ సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా గున్న సంధ్య నియామకం



జవహర్ నగర్ అక్టోబర్ 10, (విజన్ ఆంధ్ర): భారత రాజ్యాంగ హక్కుల పరి రక్షణ సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా గున్న సంధ్య నియమితులైనారు. ఈ మేరకు శనివారం భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి నిర్వాహ కులు మహంకాళి భిక్షు శనివారం ఆమెకు రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మన మూలాలను ఎప్పటికీ మర్చిపోకూడదు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గనక లేకుంటే మనం ఇంకా బానిసలుగానే మిగిలి ఉండేవాళ్లం. బానిస సంకెళు తెంచి మన బతుకులను తీర్చిదిద్దిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం ఆచరణీయ మన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు. నిన్ను నువ్వు విశ్వసించు, వ్యక్తులను వక్రీకరించినంత మాత్రాన, చరిత్రను ఎవరు వక్రీకరించలేరు అనేది నిజం.అందుకు చదువు, సంపద,సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ కలలు కన్న కుల రహిత సమాజం కోసం, మా మహిళల అభ్యున్నతి కోసం, హిందూ కోడ్ బిల్లు కోసం, అంబేద్కర్ ఆనాడే తన న్యాయశాఖ పదవికి రాజీనామా చేసిన త్యాగమూర్తి, రాజ్యాంగ నిర్మాత పితామహుడు అన్నారు. అంబేద్కర్ అందరివాడు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అంబేద్కర్ ని ఆరాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని గున్నాసంధ్యా అన్నారు. ఎందుకంటే అతడే గనక లేకుంటే ఈరోజు వర్ణ వ్యవస్థలో, ఇంకా కుల వృత్తులపై ఆధారపడి ఉండేవాళ్లం. ఇంతటి స్వేచ్ఛ, సమానత్వం హక్కులు, భావ ప్రకటన, ప్రాథమిక హక్కులు మనకు దక్కేవి కాదని అన్నారు, అందుకు జనాన్ని చైతన్యపరచుటకు మహంకాళి బిక్షు చేస్తున్న జ్ఞానమాల కార్యక్రమాలను చూసి, నేను కూడా నా వంతు కర్తవ్యంగా అంబేద్కర్ ఐడియాలజీ కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద ఆనంద్, అబ్బగోని నాగరాజు, మేడ స్వామి గడిపే సునీల్ గడ్డం గిరి, జడల కిట్టు, నవీన్, సాలమ్మా తదితరులు పాల్గొన్నారు

## సంగారెడ్డి లో సీబీఎస్ షాపింగ్ మాల్ దసరా డబుల్ ధమాకా సేల్ ప్రారంభం

**-సినీనటి పాయల్ రాజపుత్ సందడి**



సంగారెడ్డి బ్యూరో , అక్టోబర్ :10(విజన్ ఆంధ్ర ) : చందన బ్రదర్స్ ధమాకా సెల్ కార్యక్రమంలో సినీనటి పాయల్ రాజపుత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి కి రావడం చాలా సంతోషంగా ఉంది సీబీఎస్ దసరా డబుల్ ధమాకా సేల్ ప్రారంభోత్సవంలో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కుటుంబ వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు, షూటింగ్ కాస్ట్యూమ్స్ కోసం తాను సీబీఎస్‌లోనే షాపింగ్ చేస్తానని తెలిపారు. ఇక్కడ లభించే డిజైన్లు, వెరైటీలు ప్రత్యేకంగా ఉంటాయని, అందుకే సీబీఎస్ తనకు ఎంతో ఇష్టమైన షాపింగ్ డెస్టినేషన్‌గా మారిందన్నారు. సీబీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ40 ఏళ్ల అనుబంధంతో తమ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తోందన్నారు. తాము ప్రారంభించిన ప్రతి షోరూంకు స్థానిక ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పారు.సంగారెడ్డి ప్రజల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి షోరూంను తీర్చిదిద్దినట్లు ఇప్పుడు సంగారెడ్డి ప్రజల కోసం దసరా డబుల్ ధమాకా సేల్ తీసుకొచ్చాము అని తెలిపారు.అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలతో పాటు ఆధునిక ఫ్యాషన్ దుస్తులను అందించడమే తమ లక్ష్యమన్నారు. అదే తమ విజయ రహస్యమని తెలిపారు. దసరా, దీపావళి పండుగలతో పాటు షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవం సందర్భంగా షోరూంలో భారీగా కస్టమర్లు సందడి చేశారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ చీరలు, ఇతర వస్త్రాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. దీంతో షోరూం అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. సీబీఎస్ చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "దసరా డబుల్ ధమాకా సేల్" లో భాగంగా కస్టమర్లకు ఆకర్షణీయమైన ధరల్లో ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

## కలెక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :10(విజన్ ఆంధ్ర ) : సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలని టి యు డబ్ల్యు జే (ఐ జేయు) జర్నలిస్టులు ఆకాంక్షించారు.

పేద బడుగు వర్గాల తో పాటు జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. టి యూ డబ్ల్యు జె -ఐ జె యు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను జర్నలిస్టులు క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుస్తకాలు, పెన్నులు అంద జేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏ అండ దండా లేని పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండాలని కోరారు. అందుకు తగిన ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలో జర్నలిస్టులకు తోడుగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మనస్ఫూర్తిగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మతిన్, సీనియర్ జర్నలిస్టు మసూద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, జర్నలిస్టులు సూర్య వెంకట్, దినేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ తో ఎన్నికలు




విజయవాడ, అక్టోబరు 10 : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రస్తుతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో నడుస్తున్న న్యాయపరమైన ప్రక్రియను కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని ఎస్ఈసీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి తుది తీర్పు , స్పష్టమైన ఆదేశాలు వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా బలగాల మోహరింపును దృష్టిలో ఉంచుకుని స్థానిక పోరును ఏకకాలంలో కాకుండా విడతల వారీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల దశలను పక్కా ప్రణాళికతో చేపట్టేలా కసరత్తు చేస్తున్నామన్నారు.ఉన్నతాధికారుల సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, నిధుల సమీకరణ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికార యంత్రాంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రక్రియ చట్టబద్ధంగా సాగేలా గట్టి నిఘా ఉంచాలని పునేఠా స్పష్టం చేశారు. న్యాయస్థానం వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించడంతో వచ్చే రెండు, మూడు నెలలు స్థానిక ఎన్నికల హంగామా కనిపించనుంది.

# బెజవాడకు దళపతి విజయ్

విజయవాడ, అక్టోబరు 10 : తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు



కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను బట్టి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకే ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చుని భావిస్తున్నారు.తమిళనాట విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయ స్థాయిలోనూ ఆసక్తి రేపుతున్న తరుణంలో, ఆయన ఏపీ టూర్ ఖరారైతే అది తెలుగు రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు తెరలేపడం ఖాయం.

# 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగం

తిరుపతి అక్టోబరు 10 : ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు, నగరాల్లో వ్యాపారాలు, నివాస గృహాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత నిబంధనలు తెస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్-2026 ను అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న సంక్లిష్టమైన విభిన్న జోనింగ్ నిబంధనలను రద్దు చేసి, ఆధునిక అవసరాలకు తగినట్లుగా కేవలం 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగాన్ని క్రమబద్ధీకరించారు.ఈ నూతన విధానంలో అత్యంత కీలకమైన అంశం నెగిటివ్ లిస్ట్ విధానాన్ని ప్రవేశపెట్టడం. గతంలో ఒక నిర్దిష్ట భూమిలో ఏ నిర్మాణానికి అనుమతి ఉందో తెలుసుకోవడానికి పౌరులు, డెవలపర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు నెగిటివ్ లిస్ట్ ద్వారా సదరు జోన్‌లో ఖచ్చితం ప్రోహిబిటెడ్ కార్యకలాపాలు మినహా, మిగిలిన అనుకూల ప్రాజెక్టులన్నింటికీ ఆటోమేటిక్‌గా అనుమతులు లభించే వీలుంది. ఈ పారదర్శక విధానం వల్ల అధికారులు నిబంధనల పేరుతో చేసే అనవసర ఆటంకాలకు, అవినీతికి శాశ్వత చెక్ పడనుంది.ఈ కొత్త జోనింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఇటీవలే సమగ్రంగా సవరించిన 'ఏపీ బిల్డింగ్ రూల్స్'ను కూడా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 24 మీటర్లు , అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను 'హైరైజ్' భవనాలుగా పరిగణిస్తూ, వాటికి అవసరమైన ఫైర్, పర్యావరణ అనుమతులను డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకే గొడుగు కిందకు తెచ్చారు. అంతేకాకుండా, పెద్ద నివాస, వాణిజ్య కాంప్లెక్స్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు, 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ఆఫీసుల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని నిబంధనల్లో భాగం చేశారు.ఈ జోనింగ్ సంస్కరణల వల్ల గృహ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరి అందడమే కాకుండా, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత మెరుగవుతుంది. సుదీర్ఘకాలంగా మాస్టర్ ప్లాన్లు, భూ వినియోగ మార్పిడుల వివాదాల్లో చిక్కుకున్న భూములకు స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తి వ్యాపారం, మౌలిక వసతుల కల్పన వేగవంతం కానున్నాయి

# శీతాకాలం ఉన్నట్టా..

తెలంగాణలో ఈ ఏడాది శీతాకాలం ఛాయలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల నిష్క్రమణతో వాతావరణంలో చలి పుంజుకోవాలి. కానీ, ఈ ఏడాది దానికి విరుద్ధంగా అక్టోబర్ ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో శీతాకాలపు ఆనవాళ్లు లేకుండా పోవడానికి వాతావరణ మార్పులతో పాటు పాలకుల విధానపరమైన వైఫల్యాలే ప్రధాన కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నైరుతి రుతుపవనాల ఉపసంహరణ సమయంలోనే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదిలాబాద్‌లో 37 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల కాలంలో ఏకంగా 17 శాతం వర్షపాత లోటు నమోదైంది. మొత్తం 615.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, అంతకంటే తక్కువగా వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అయితే ఏకంగా 27 శాతం వర్షపాత లోటు నమోదు కావడం పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేశారనేదానికి నిదర్శనం.ప్రకృతిలో వస్తున్న ఈ మార్పులపై పాలకులకు స్పష్టమైన ప్రణాళిక కొరవడింది. ఎల్ నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. కానీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైంది. కర్బన ఉద్గారాలను తగ్గించడం, పట్టణాల్లో గ్రీనరీని పెంచడంపై కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న రాజకీయ నాయకులు, గ్రౌండ్ లెవెల్‌లో కాలుష్య నియంత్రణకు కఠినమైన చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.రుతుపవనాల నిష్క్రమణలో జాప్యం, వర్షపాత లోటు కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిన్నది. దీనివల్ల అక్టోబర్ నెలలోనే ప్రజలు తీవ్ర ఉక్కపోతతో, అసౌకర్య వాతావరణంతో అల్లాడిపోతున్నారు. శీతాకాలం జాడ లేకపోవడం వల్ల రాబోయే కాలంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి, వ్యవసాయ రంగానికి నష్టాలు తప్పవని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టి, వాతావరణ మార్పులను అరికట్టే దీర్ఘకాలిక విధానాలను అమలు చేయకపోతే.. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు.

# ఆహార భద్రత కల్తీ నాణ్యత పె దృష్టి సారించాలి

ఆళ్లగడ్డ : ఆహారభద్రత, నాణ్యత ప్రమాణాలు, కల్తీ లపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సమాఖ్య కార్యదర్శి విజయ్ విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డ లోని పలు మిఠాయి దుకాణాలను శనివారం అయన తనిఖీ చేశారు.రానున్న దసరా, దీపావళి పండుగల సందర్భంగా మిఠాయిలు, పానీయాలు, పాల ఉత్పత్తులు వినియోగించడం అధికంగా ఉంటుందని ఇదే అదనుగా భావించి నకిలీ, కల్తీ, సురక్షితం కాని ఆహార పదార్థాలను అమ్మకం జరిపేందుకు కొందరు అక్రమ వ్యాపారులు ప్రయత్నిస్తారన్నారు.ఇలాంటి వారిపై ఆహార భద్రత తాధికారులు తగిన చర్యలు తక్షణం ఉపక్రమంచాలని రాష్ట్ర వినియోగ దారుల రక్షణ సంఘాల సమైఖ్య వ్యవహారిక కార్యదర్శి విజయ కోరారు. అక్రమ వియాలను అరికట్టడానికి పర్యవేక్షణ మరియు అమలు చర్యలను పెంచాలని ఫుడ్ పఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఈఛాం) ను కోరారు. అభనిర్తించారు విజయ్, పండుగల కాలమంతా నాణ్యమైన మరియు కల్తీ లేని ఆహారాన్ని అందించేలా చూడాలని మరియు అక్కడి కక్కడే వేగవంతమైన ఆహార పరీక్షలు నిర్వహించాలని సంభందిత అధికారులను ( డిసిగ్నేటెర్ ఆఫీసర్లు / ఆహార భద్రతాధికారులు) కోరారు. అందుబాటులో ఉన్న చోట్ల ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ( ఎఫ్. యస్. ఒబ్ల్యు) వాహనాలను ఉపయోగించి తయారీ కేంద్రాల వర్ణనే పరీక్షలు నిర్వహించి వినియోగ దారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాలను అందించేందుకు కృషి చేయవలసిన అవసరమెంతైన ఉన్నదని విజయ్ అభిపాలయ పడ్డారు. స్థానికంగా ఉన్న ఓ బేకరి తయారీని సందర్శించి అక్కత వారు వాడు చున్న నూనెలను ఇతర పదార్థాలను పరిశీలించి తగిన సూచన లిచ్చారు. మరి మునంగా పరిశుభ్రతను పాటించాలని, వాడిన నూనెనే తిరిగి వాదకూడదని, కల్తీలకు చోటు ఇవ్వరాదని ఇందుకు విరుద్ధంగా తయారీలు జరిపిన చో అట్టి వారిపై కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని విజయ్ హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం.. ఓటమి భయంతోనే ఆందోళనలు - కీర్తిరెడ్డి



హైదరాబాద్ : ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ప్రజాదరణను కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందని, ఓటమి భయంతోనే వివిధ అంశాలపై ఆందోళనలు చేస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను సరిచేయడం, డూప్లికేట్ ఓట్లు, అనర్హమైన ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి అవసరమని కీర్తిరెడ్డి పేర్కొన్నారు. గతంలో ఓటర్ల జాబితాలో అక్రమాలున్నాయని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు వాటిని సరిచేసే ప్రక్రియను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటమే ఎస్ఐఆర్ లక్ష్యమని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలగించబడిన ఓట్ల విషయంలో అభ్యంతరాలుంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలే తప్ప, రోడ్లపై ఆందోళనలు చేయడం సరికాదని హితవు పలికారు. ఓట్ చోరీ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని కీర్తిరెడ్డి విమర్శించారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నాలు, ఆందోళనలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఇమేజ్ కోసం ప్రయత్నించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా ఓటర్లపై ప్రేమ ఉంటే.. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు, అనర్హమైన ఓట్ల తొలగింపు ప్రక్రియకు సహకరించాలని కీర్తిరెడ్డి సూచించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీ ముఠాలో పరారీలో ఉన్న మరో నిందితుడి అరెస్ట్

- కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరుస ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడిన ముఠాలో కీలక నిందితుడి అరెస్ట్.
- విచారణలో 54 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు వెల్లడి
- కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 73 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు గుర్తింపు
- చోరీలకు ఉపయోగించిన పరికరాలు, నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనం స్వాధీనం
- 54 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు వెల్లడి
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 10(విజన్ఆంధ్ర) కామారెడ్డి జిల్లాతో పాటు మెదక్ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠాలో పరారీలో ఉన్న మరో నిందితుడిని భిక్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు తక్ షంషేర్ సింగ్‌ను 10.10.2026న భిక్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నేరానికి పాల్పడేందుకు రెక్కీ నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ తెలిపారు.





***- గతంలో ముగ్గురి అరెస్ట్ -- పరారీలో ఉన్న నిందితుడి పట్టివేత***

గతంలో భిక్నూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 340/2026 కేసులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్జీత్ సింగ్ చతుర్ సింగ్ తక్, రూప్ సింగ్ చతుర్ సింగ్ తక్, లఖన్ చతుర్ సింగ్ తక్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, 11.09.2026న కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడైన తక్ షంషేర్ సింగ్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలింపు చేపట్టిన పోలీసులు తాజాగా పట్టుకున్నారు.

***- కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో 54 చోరీ కేసుల్లో ప్రమేయం***

విచారణలో నిందితుడు తక్ షంషేర్ సింగ్, సత్నామ్ సింగ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని భిక్నూర్, రాజంపేట, జుక్కల్, పెద్దకొడపగల్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులతో పాటు మెదక్ జిల్లాలోని చేగుంట, నర్సింగి, నిజాంపేట, శంకరంపేట, శివంపేట, తూప్రాన్, వెల్దుర్తి, రామాయంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులపై విచారణ కొనసాగుతోంది.

నిందితుడు మొత్తం 54 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసుల్లో తన ప్రమేయం ఉన్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మొత్తం 73 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ కేసులకు సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్లతో సమన్వయం చేసుకుంటూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

***- చోరీ పరికరాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం***

నిందితుడి వద్ద నుంచి రెండు ఆక్సర్ బ్లేడ్లు, రెండు కటింగ్ ప్లయర్లు, రెండు పానలు, ఒక కట్టర్, ఒక సైకిల్ ట్యూబుతో పాటు నంబర్ ప్లేట్ లేని ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ జె. నరేష్, భిక్నూర్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. అనిల్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ సిబ్బంది ఏఎస్ఐ వెంకట్రావు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, శ్రీకాంత్, కిషన్ గౌడ్, శేఖర్ ఈ ఆపరేషన్‌లో పాల్గొని నిందితుడిని పట్టుకున్నారు.ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు, విద్యుత్ పరికరాల చోరీలు లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## పిల్లాపాపలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో మునిగితేలిన ములుగు ప్రజలు





ములుగు, అక్టోబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు ములుగు జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. మహిళలు పిల్లాపాపలతో కలిసి పెద్ద ఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. గునుగు, తంగేడు, బంతి, చేమంతి తదితర రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళలు సాంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు. చిన్నారులు సైతం తల్లులతో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొని సందడి చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కాలనీల్లో బతుకమ్మ సంబరాలు కనువిందుగా సాగాయి. కుటుంబ సమేతంగా జరుపుకునే ఈ పండుగ మహిళల్లో ఆత్మీయతను, ఐక్యతను పెంచుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా ఉత్సవాలు..

## ఘనంగా లేజర్ షో నిర్వహిస్తాం - మహమ్మద్ షబ్బీర్ అలీ

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 10(విజన్ఆంధ్ర) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శనివారం 78 లక్షల రూపాయలతో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు పనులకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శంకుస్థాపన స్థాపన చేశారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా ఉత్సవాలను షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో 78 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఫ్లడ్‌లైట్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో దసరా ఉత్సవాల పునఃప్రారంభంపై వివరాలు వెల్లడించారు.

**- కరోనా కారణంగా నిలిచిపోయిన ఉత్సవాలు పునఃప్రారంభం.**

షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో ఏటా దసరా ఉత్సవాలు, రావణ దహనం, లేజర్ షో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేవారమని షబ్బీర్ అలీ గుర్తుచేశారు. కరోనా మహమ్మారి కారణంగా ఈ కార్యక్రమాలకు విరామం ఏర్పడిందని తెలిపారు. ఈ ఏడాది నుంచి తిరిగి దసరా ఉత్సవాలను ప్రారంభించి, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.







**- 1990లో ప్రారంభమైన దసరా ఉత్సవాల ప్రస్థానం.**

1990లో తొలిసారిగా మల్లన్నగుట్ట వద్ద రావణ దహనం, లేజర్ షోతో దసరా ఉత్సవాలను ప్రారంభించినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. అనంతరం నాలుగు సంవత్సరాల పాటు సీఎస్సీ గ్రౌండ్‌లో ఉత్సవాలు నిర్వహించామని, ఇందిరాగాంధీ స్టేడియం అందుబాటులోకి వచ్చిన తర్వాత సుమారు 20 సంవత్సరాల పాటు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించామని వివరించారు.

**- త్వరలో ఉత్సవ కమిటీ ఏర్పాటు.**

దసరా ఉత్సవాల నిర్వహణ కోసం త్వరలో ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తామని షబ్బీర్ అలీ తెలిపారు. కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించి, కామారెడ్డి పట్టణ ప్రజలకు పండుగ వాతావరణాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు పూర్తయితే క్రీడాకారులకు, క్రీడా కార్యక్రమాలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. స్టేడియం అభివృద్ధితో పాటు దసరా ఉత్సవాల పునఃప్రారంభం ద్వారా పట్టణ ప్రజలకు మరింత ఉత్సాహభరితమైన వేడుకలను అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ కౌన్సిలర్లు అన్వార్, షేరు, సత్యం, సిద్దిక్, అంజాద్, యూనుస్, చిట్టిబాబు, గంగాధర్, గూడెం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సందీప్, రాజగౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, సుతారి రమేష్, భూమని బాలరాజు, అనుమాల రాము కుమార్, అశోక్ రెడ్డి, పండ్ల రాజు, కన్నయ్య, నరేందర్ రెడ్డి, గొనె శ్రీనివాస్, ముబషీర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో 18 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం ం
- మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్ట్
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు




కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 10(విజన్ఆంధ్ర) : కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమంగా గంజాయి తరలిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, తనిఖీలు చేపట్టారు. నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో కానిస్టేబుళ్లు అమృత్ రెడ్డి, శిరీష, రాజు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బంది సహకరించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అశోక్ (26)గా గుర్తించామని, అతను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినికి చెందిన వ్యక్తి అని అధికారులు వెల్లడించారు. ఒడిశాలోని టిట్లాగఢ్ ప్రాంతం నుంచి నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు.

**అక్రమ మాదకద్రవ్యాలపై సమాచారం అందించండి**

దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, కోరారు.సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523 కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమ కార్యకలాపాలపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పండుగ సమయంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# వేటగాళ్ల ఉచ్చుకు రైతు బలి.. మాయమైన మృతదేహం.!!

- అజాంనగర్ అటవీ ప్రాంతంలో దారుణం..!!
- అటవీ ప్రాంతంలో అమర్చిన విద్యుత్ తీగలే ప్రాణం తీశాయా.?
- ట్రాక్టర్ డ్రైవర్లు తిరిగొచ్చేసరికి మృతదేహం అదృశ్యం..!
- గ్రామంలో కలకలం..

భూపాలపల్లి : భూపాలపల్లి మండలం అజాంనగర్ అటవీ ప్రాంతంలో దారుణం జరిగింది. అడవిలో పోడు భూమి సాగు కోసం రాత్రిపూట వెళ్లిన ఓ రైతు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహం కోసం అటు అటవీశాఖ సిబ్బంది, ఇటు గ్రామస్తులు అడవిలో జల్లెడ పడుతున్నారు. ఈ సంఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. అజంనగర్ గ్రామానికి చెందిన జడల అశోక్ (35) శుక్రవారం రాత్రి అజంనగర్--నిమ్మగూడెం మధ్యనున్న అటవీ ప్రాంతంలో పోడు భూమి సాగు కోసం వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వేటగాళ్లు వన్యప్రాణుల వేట కోసం అమర్చినట్లు భావిస్తున్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం.



**- మృతదేహం ఏమైంది?**

అశోక్ విద్యుత్ తీగలకు గురై మృతి చెందిన ఘటనను గమనించిన ట్రాక్టర్ డ్రైవర్లు గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు సమాచారం అందించినట్లు తెలిసింది. అయితే గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకునేలోపే మృతదేహం కనిపించకుండా పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అసలు అక్కడ ఏం జరిగింది? మృతదేహం ఎక్కడికి వెళ్లింది? దానిని ఎవరైనా తరలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పరిణామం గ్రామస్తుల్లో ఆందోళనను మరింత పెంచింది.

**- విద్యుత్ తీగలు అమర్చిందెవరు?**

అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చినట్లు వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి తీగలు మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అశోక్ మృతికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? విద్యుత్ తీగలను ఎవరు అమర్చారు? మృతదేహం కనిపించకుండా పోవడానికి కారణమేంటి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతదేహం ఆచూకీ, అధికారిక ధ్రువీకరణ ఇంకా తెలియాల్సి ఉంది.

## బెంగళూరులో మాస్టర్ మెన్స్ ఫిజిక్స్ లో సత్తా చాటిన బాడీ బిల్డర్ ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించిన మిత్రబృందం





అయిజ: విజన్ ఆంధ్ర పత్రిక అక్టోబర్ 10 : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన ఆర్ఎస్ జిమ్ ట్రైనర్ ప్రభాకర్ బెంగళూరులో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో టైటిల్ విన్నర్‌గా నిలిచిన సందర్భంగా ఆయన మిత్రబృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌కు మిత్రులు శుభాకాంక్షలు తెలియజేసి, శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. బాడీ బిల్డింగ్ రంగంలో ప్రతిభ కనబరిచి టైటిల్ విజేతగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి అయిజ పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాల మల్లికార్జున్,లి 14వ వార్డు కౌన్సిలర్ డా. ఎం. కృష్ణ, మాజీ కౌన్సిలర్ మహేందర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సూరిబాబు, ప్రవీణ్ రమేష్, విజయ్ భాస్కర్, ఆర్ఎంపీ డాక్టర్ వీరేష్, ఆనంద రాజు, విజన్ ఆంధ్ర రిపోర్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## 46వ వార్డులో రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 10(విజన్ఆంధ్ర) : కామారెడ్డి పట్టణ అభివృద్ధిలో భాగంగా 46వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ గేరిగంటి లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ కన్నయ్యతో కలిసి ఆయన పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వార్డుల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలుగుతుందని, రహదారుల అభివృద్ధి ద్వారా పట్టణంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్వార్, షేరు, సత్యం, సిద్దిక్, అంజాద్, యూనుస్, చిట్టిబాబు, గంగాధర్, లోలం శ్రీనివాస్, లక్ష్మణ్, మన్సూర్, గేరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ, పిట్ల వేణు, ఏజాజ్, గూడెం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, రాజగౌడ్, భూమని బాలరాజు, అనుమాల రాము కుమార్, ఇంద్రకరణ్ రెడ్డి, అశోక్ రెడ్డి, పండ్ల రాజు, కన్నయ్య, నరేందర్ రెడ్డి, గొనె శ్రీనివాస్, ముబషీర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లా కేంద్రంలో కదం తొక్కిన గులాబీ శ్రేణులు.

సూర్యాపేట : జిల్లా ఏర్పడి 10 వసంతాలు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు నుండి కొత్త బస్టాండ్ వరకు 2ఐ రన్ నిర్వహించి, జిల్లాను ఏర్పాటు చేసిన కేసీఆర్ కి బీఆర్ఎస్ కార్యకర్తలు, పట్టణ ప్రజలు, యువత కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా యుగంధర్ రావు, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, నంద్యాల దయాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు.

# కేసీఆర్ నిర్ణయంతో గద్వాలకు ప్రత్యేక జిల్లా గుర్తింపు

***జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని ఉద్యమకారులను ఘనంగా సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు***



గద్వాల అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఅర్. ఆదేశాల మేరకు శనివారం గద్వాల నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్. కేశవ్, సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, కురువ విజయ్ కుమార్, బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య జిల్లా ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాను ఇచ్చిన ఘనత కెసిఆర్ గారిదే అని, జిల్లా ఇచ్చి పరిపాలను ప్రజల దగ్గర కు తెచ్చిన నాయకుడు రాష్ట్ర సాధకులు కెసిఆర్ అని అన్నారు.కేసీఆర్ దూరదృష్టితోనే తెలంగాణలో 33 జిల్లాల ఏర్పాటు,గద్వాల జిల్లా ప్రజల ఆకాంక్షలకు సాకారం చేశారని తెలిపారు.పరిపాలనను ప్రజల ముంగిటకు చేర్చిన కేసీఆర్‌కు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం పరిపాలనా వికేంద్రీకరణకు పెద్దపీట వేస్తూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని అని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పాటుచేసి 10ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా సందర్భంగా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఉద్యమకారులను సన్మానించి, తెలంగాణ ఉద్యమంలో వారు చేసిన సేవలను కొనియాడుతూ ఉద్యమాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ సాధనకు కృషి చేసి పాటుపడిన ఉద్యమకారులు,జిల్లా ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ..

***తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్***



అలంపూర్ అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ పండుగ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ హృదయపూర్వక బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన మన సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని అన్నారు.బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, కుటుంబాల్లో ఆనందాన్ని, సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపదను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, మహిళల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని, రైతులు, కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఆడపడుచులందరికీ, రాష్ట్ర ప్రజలకు, అలంపూర్ నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు

- **నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలి**
- **కృషి చేసిన సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం లభిస్తుంది**
- **ఐదుగురు సిబ్బందికి రివార్డులు అందజేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**





ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర)నేరాల నియంత్రణలో భాగంగా ప్రతిభ కనబరిచి నిందితులను పట్టుకోవడంతో పాటు దొంగిలించిన వస్తువులను రికవరీ చేసిన ఐదుగురు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో మొబైల్ ఫోన్ల దొంగతనాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం తనిఖీల్లో సంజయ్ నగర్‌కు చెందిన సయ్యద్ అజీజ్ అనే నిందితుడి వద్ద మూడు మొబైల్ ఫోన్లు లభించగా, వాటిని రికవరీ చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ప్రతిభ కనబరిచిన జె. రమేష్, పి. రాహుల్, కిషోర్ కుమార్‌లను ఎస్పీ అభినందించారు. అదేవిధంగా ఆదిలాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న వ్యక్తి వద్ద నుంచి పర్సు దొంగిలించేందుకు ప్రయత్నించిన జైనథ్‌కు చెందిన సునీల్ బంసోడెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న స్పెషల్ పార్టీ సిబ్బంది ఎస్. రాకేష్‌ను, రిమ్స్ ఆసుపత్రి వద్ద మరొకరి వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌ను తన వాహనానికి ఉపయోగిస్తున్న ఉన్కేశ్వర్‌ను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ జి. వికాస్‌ను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో, అప్రమత్తంగా పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. సమర్థవంతంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

# ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోండి.. విద్యుత్ బిల్లును జీరోకు తగ్గించుకోండి..

**పీఎం సూర్య ఘర్ పథకం రాయితీలను సద్వినియోగం చేసుకోండి.. కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే విజ్ఞప్తి.**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10: (విజన్ ఆంధ్ర) గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ను ఏర్పాటు చేసుకుని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తమ్ జాడే కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కోరారు. విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు సౌర విద్యుత్ ద్వారా ఇంటి అవసరాలకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన ఒక మంచి అవకాశం అందించిందని పేర్కొన్నారు. ఇళ్ల పైకప్పులపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సూర్యరశ్మి సహాయంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. దీనివల్ల గ్రిడ్ నుంచి తీసుకునే విద్యుత్ వినియోగం తగ్గి, నెలవారీ విద్యుత్ బిల్లుపై గణనీయమైన ఆదా పొందే అవకాశం ఉందన్నారు. సోలార్ ప్లాంట్ సామర్థ్యం, ఇంటి విద్యుత్ వినియోగం, సౌర విద్యుత్ ఉత్పత్తిని బట్టి విద్యుత్ బిల్లు జీరోకు చేరే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. బ్యాంకులు అతి తక్కువ వడ్డీ రేట్లకేలి రుణ సదుపాయాలు కల్పిస్తున్నాయని , నెలవారి చెల్లించే సదుపాయం కూడా అందుబాటులో ఉందని చెప్పారు.




కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు

పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హులైన గృహ వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది.

- 1 కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు: రూ.30,000 సబ్సిడీ
- 2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌కు: రూ.60,000 సబ్సిడీ
- 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి: గరిష్ఠంగా రూ.78,000 సబ్సిడీ

ఈ రాయితీల వల్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే ప్రారంభ వ్యయం తగ్గుతుంది. అర్హత, సాంకేతిక ప్రమాణాలు, పథకం నిబంధనలకు అనుగుణంగా సబ్సిడీ లభిస్తుంది. 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ద్వారా అనుకూల పరిస్థితుల్లో నెలకు 360 యూనిట్ల పై మేరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. అయితే వాతావరణ పరిస్థితులు, పైకప్పుపై సూర్యరశ్మి లభ్యత, ప్లాంట్ పనితీరు ఆధారంగా ఉత్పత్తి మారుతుందన్నారు. ఇంటి విద్యుత్ వినియోగం సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు అనుగుణంగా ఉంటే విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. అర్హులైన గృహ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ హ్ట్జాం://జూఎంబతీఘిస్త్రఘ్తుతీ.ప్రశీజ.అఅ ద్వారా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్, ఆమోదిత విక్రేత ఎంపిక, సోలార్ ప్లాంట్ ఏర్పాటు, తనిఖీ, నెట్ మీటరింగ్, సబ్సిడీ పొందే ప్రక్రియను పథకం మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలి. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే ముందు తమ ఇంటి విద్యుత్ వినియోగం, అవసరమైన ప్లాంట్ సామర్థ్యం, పైకప్పుపై అందుబాటులో ఉన్న స్థలం, మొత్తం వ్యయం, సబ్సిడీ అర్హత వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. రూఫ్‌టాప్ సోలార్ వినియోగం ద్వారా సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చు. ప్రతి అర్హుడైన గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు షీ టీం నిరంతర కృషి

- **నెలవారీ నివేదికలో 136 ఫిర్యాదులపై స్పందన**
- **117 ఈ-పెట్టి కేసులు, 5 ఎఫ్ఐఆర్‌ల నమోదు**
- **2 బాల్యవివాహాలను అడ్డుకుని, 48 అవగాహన కార్యక్రమాల నిర్వహణ**
- **163 హాట్‌స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు.. 49 గ్రామాల్లో పర్యటనలు**
- **ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు**
- **మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలి.... జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 10( విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల భద్రతకు షీ టీం, పోలీస్ అక్క బృందాలు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వేధింపులకు గురయ్యే బాధితులకు అండగా నిలవాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. శనివారం పోలీసు ముఖ్య కార్యాలయంలో షీ టీం మరియు పోలీస్ అక్క బృందం చే నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. షీ టీం నెలవారీ నివేదిక ప్రకారం మొత్తం 136 ఫిర్యాదులు అందగా, వాటిపై స్పందించి 117 ఈ-పెట్టి కేసులు, 5 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు తగిన సహాయ సహకారాలు అందించారు. మహిళలు, విద్యార్థినులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని వివిధ హాట్‌స్పాట్లలో 163 ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నెలరోజుల వ్యవధిలో 49 గ్రామాలను సందర్శించి మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, నెలలో రెండు బాల్యవివాహాలను అడ్డుకోవడంలో షీ టీం బృందాలు కీలక పాత్ర పోషించాయి. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఎస్పీ సూచించారు. మహిళలు, చిన్నారులు పాఠశాలల్లో, కళాశాలల్లో, పని ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి వేధింపులకు గురైనా, ఈవ్ టీజింగ్ లేదా బ్యాడ్ టచ్ వంటి ఘటనలు ఎదురైనా భయపడకుండా పోలీస్ అక్క లేదా షీ టీం బృందాలను సంప్రదించాలని తెలిపారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, బాల్యవివాహాల నివారణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై 48 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళలు తమ వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని, ఫొటోలు, వీడియోల దుర్వినియోగం లేదా ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం, పోలీస్ అక్క సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎలాంటి వేధింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా షీ టీం నంబర్ 8712659953 లేదా డయల్ 100/112కు సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యులు ఏఎస్ఐ సుశీల, హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, పోలీస్ అక్క సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పోలీసు విధులలో క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి...

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**
- **విధులలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని వహించకుండా ఉండాలి**
- **త్వరలో సిబ్బంది అందరికీ మెడికల్ హెల్త్ క్యాంప్.**
- **విధులలో నిజాయితీగా వ్యవహరించాలని సూచన.**
- **షూరిటీలు ఇచ్చే విషయంలో ఆచితూచి వ్యవహరించాలని సూచన.**
- **శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో పరేడ్ నిర్వహించిన.... జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర)సిబ్బంది ప్రతి ఒక్కరూ యూనిఫామ్ కు ఉన్న గౌరవాన్ని పెంచే విధంగా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు జరిగిన పరేడ్ నందు జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. మొదటగా ఆదిలాబాద్ జిల్లా పోలీసులు గణపతి నవరాత్రి ఉత్సవాలలో సిబ్బంది చేసిన విధులకు గాను అభినందించారు, అదేవిధంగా రానున్న నవరాత్రి ఉత్సవాలను సైతం అదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని తెలియజేశారు. సిబ్బంది పరేడ్ ను, యూనిఫామ్ యొక్క ప్రాముఖ్యతపై వివరించి సిబ్బంది ధరించిన యూనిఫామ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రతి శనివారం పరేడ్ లేదా యోగా నిర్వహిస్తూ శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా సిబ్బంది ప్రతిరోజు వ్యాయామం చేయాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని విధుల నందు ఎలాంటి నిర్లక్ష్యాన్ని వహించవద్దని, ముఖ్యంగా నిజాయితీతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా సిబ్బంది ఇతరులకు షూరిటీ (లోన్ నందు హామీ) ఇచ్చే సమయంలో సరైన వారికి ఇవ్వాలని లేని పక్షంలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. విధులను నిర్వర్తిస్తున్న క్రమంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. శనివారం పరేడ్ నందు జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలలో మరియు ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు పరేడ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. 50 సంవత్సరముల పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా యోగ నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది అందరికీ త్వరలో మెడికల్ హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయడం జరుగుతుందని అనే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రైవేటు ఇన్సూరెన్సును తీసుకొని అత్యవసర ఆరోగ్య సమయాలలో వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు కె నాగరాజు, బి సునీల్ కుమార్, బి డి ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, వెంకటేశ్వర్లు, రహీం పాషా, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ బుట్ట ప్రయాణం

## - ఒక ఆత్మీయ కథ



ములుగు అక్టోబరు 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి: తయారీదారు ఎండలో బుట్టల మోపును నెత్తిన పెట్టుకొని వీధి వీధి తిరిగే మేదరి కులానికి చెందిన అవ్వ. పూర్వం అందరూ బుట్టలు అల్లేవారు కాదు. ఇది వారి కుల వృత్తి, జీవనాధారం. కొందరు అమ్మేవారు, చాలా మంది కొనేవారు, కానీ ఆమె లేకుండా పండుగ మొదలయ్యేది కాదు. బతుకమ్మకు ఆమే ప్రారంభం.

**సృష్టి.**

ఆమె చేతిలో అన్ని బుట్టల్లోకెల్లా చిన్నదైన, ముఖ్యమైన బుట్ట – బిబతుకమ్మ సిబ్బిబి. వెదురు బొంగు నుండి సన్నని బద్దలను తీసి అల్లిన ఈ చిన్న వలయం కేవలం ఒక వస్తువు కాదు, తరతరాలుగా వస్తున్న నైపుణ్యం.

**ఆహ్వానం**

ఆమె దగ్గర కొన్న తర్వాత ఆ బుట్ట ఇంటి ఆడబిడ్డల చేతుల్లోకి చేరుతుంది. ఫోటోలో చూసినట్లుగా వారు కలిసి కూర్చొని సిబ్బి మధ్యలో బిపసుపు, కుంకుమ బొట్లుబి పెడతారు. ఇది కేవలం అలంకరణ కాదు, ఇది బిఆహ్వానంబి – బుట్టపై కొలువుదీరమని గౌరమ్మను చేసే పవిత్ర ఆహ్వానం. ఆ తర్వాతే తంగేడు, గునుగు, బంతి పూలను పొరలు పొరలుగా పేరుస్తారు. అప్పుడు వెదురు బుట్ట దైవంగా మారుతుంది.

ఇదే మన పండుగ అసలు చక్రం.

మేదరి అవ్వ తయారు చేస్తుంది.

ఇంటి ఆడబిడ్డలు పసుపు కుంకుమతో గౌరమ్మను ఆహ్వానిస్తారు.

తర్వాత పూలతో పూజిస్తారు.

పూర్వం అందరూ అన్ని పనులు చేసేవారు కాదు, ఒకరిపై ఒకరు ఆధారపడేవారు. కొందరు అమ్మితే, కొందరు కొనేవారు, కానీ ఒకరి శ్రమను ఒకరు గౌరవించేవారు. ఈ రోజు ఈ అవ్వ మీ వీధికి వస్తే ఇరవై రూపాయల కోసం బేరం ఆడకండి. మీరు కొనేది కేవలం వెదురు బుట్ట కాదు, గౌరమ్మను అలంకరించే పవిత్ర వస్తువును కొంటున్నారు.



రచన:

**- ఓదెల చంద్రమౌళి.**

**భౌతిక శాస్త్ర నిపుణులు**

# నవ్య, నిత్య పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

*తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ: ఉపాధ్యాయులు*





బాగ్ అంబర్ పేట్ అక్టోబర్ 10 విజన్ ఆంధ్ర ప్రతినిధి బాగ్ అంబర్‌పేట్‌లో నవ్య, నిత్య పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రేపటి నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒకరోజు ముందుగానే విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. నవ్య విద్యాసంస్థల చైర్మన్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహం మధ్య సందడిగా సాగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు, పూల వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు వాటి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయడం ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పండుగల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం, ప్రకృతి పట్ల ప్రేమ, సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన పండుగలు, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు సూచించారు. నవ్య, నిత్య పాఠశాలల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ రామదేవి ఉపాధ్యాయులు మాలతి,రజిని, జ్యోతి,కవిత,మౌనిక ,వైశాలి తదితరులు పాల్గొన్నారు

# కర్ణాటక భారత్ మాల రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం..
- బాధితులంతా ఇందువాసి గ్రామ దళితులే..
- ప్రమాద బాధితులు, కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన వలస కూలీలు ప్రయాణిస్తున్న సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది, పలువురు గాయపడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన పట్ల గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి తీరని లోటు కలిగించిన ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అలాగే, ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వ తరపున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని రాయచూరు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి చెప్పడం జరిగింది. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఢిల్లీ వెళ్లే సీపీఐ నాయకుల అరెస్టులపై నిరసన జ్వాల

**ఉప్పల్ బస్ డిపో ఎదుట మోదీ దిష్టిబొమ్మ దహనం..**

**అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని మేడిపల్లి మండల సీపీఐ డిమాండ్**




బోడుప్పల్, అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఢిల్లీలో ధర్నా నిర్వహించేందుకు వెళ్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ బస్ డిపో ఎదురుగా వరంగల్ హైవేపై ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ కుమార్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ధర్నాకు బయలుదేరిన సీపీఐ,ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడమేనని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు సీహెచ్ మాధవి,జీ నాగరాజు,బీకేఎంయూ మండల అధ్యక్షుడు భూతం ఐలయ్య,సీపీఐ నాయకులు ఇస్తారి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# అయిజ మున్సిపాలిటీలో మూడు భవనాలు సీజ్..

- మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..
- మున్సిపల్ కమిషనర్



అయిజ అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపాలిటీ చట్టం–-2019 ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మూడు భవనాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత భవన యజమానులకు నిబంధనల ప్రకారం అవసరమైన నోటీసులు జారీ చేసిన అనంతరం, శుక్రవారం మధ్యాహ్నం ఆయా భవనాల్లోని సంబంధిత పోర్షన్లను సీల్ చేశారు. ఎన్.ఆర్. జనార్ధన్‌కు సంబంధించిన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న ఆర్.ఆర్. బ్రదర్స్ కిరాణం, ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ పోర్షన్లతో పాటు, కుమ్మరి బుడ్డన్నకు సంబంధించిన భవనం, చిన్న పోలుకల్‌కు సంబంధించిన భవనాలపై కూడా సీలింగ్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రజలు, భవన యజమానులు, వ్యాపారస్తులకు విజ్ఞప్తి చేస్తూ, భవన నిర్మాణాలు చేపట్టే ముందు సంబంధిత మున్సిపల్ అనుమతులు తప్పనిసరిగా పొందాలని, అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టి, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

# మాస్టర్ మెన్స్ ఫిజిక్లో జాతీయ టైటిల్ మా ప్రభాకర్ కు రావడం గర్వకారణం

***ప్రభాకర్ ను ఘనంగా సన్మానించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి***



అయిజ అక్టోబర్ 10( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయము నందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు శనివారం మాస్టర్ మెన్స్ ఫిజిక్స్ జాతీయ టైటిల్ ను గెలుపొందిన ప్రభాకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నిరుపేద నిరుపేద దళిత బిడ్డ కష్టపడి ఈరోజు దేశవ్యాప్తంగా జరిగిన వాలార్ క్లాసిక్ వారు నిర్వహించిన బాడీ బిల్డర్ పోటీలో 52 సంవత్సరాల వయసు విభాగంలో దేశవ్యాప్తంగా ప్రథమ స్థానం మా అయిజ వాసికి రావడం చాలా గర్వకారణం అని కొనియాడారు. నేటి యువత ప్రభాకర్ ని స్ఫూర్తిగా తీసుకొని చెడు వ్యసనాలకు పోకుండా ఇలాంటి జిమ్ముకు వెళ్లి మీ ఆరోగ్యాన్ని కాపాడుతూ పదిమందికి ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మన యొక్క మన అయిజ ను దేశవ్యాప్తంగా మొదటి స్థానంగా నిలిచినటువంటి మన ప్రభాకర్ ను ఆదర్శంగా తీసుకొని యువత కూడా ఇదేవిధంగా ముందుకు వెళ్లాలని, అదేవిధంగా ప్రభాకర్ అంతర్జాతీయ స్థాయిలో పోటీలో పాల్గొని మన యొక్క దేశానికి పేరు తేవాలని కోరుకున్నారు. నిత్యం కష్టపడుతూ కొన్ని కోరికలు వదులుకొని ఈరోజు మన మా ఊరికే కాదు తెలంగాణ రాష్ట్రానికి ఒక మంచి పేరు తేవడం జరిగినది. అదేవిధంగా భవిష్యత్తులో దేశానికి మంచి పేరు తేవాలని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు వారి కోరిక అయినా ఒలంపిక్స్ లో మెయిన్స్ ఫిజిక్స్ లో పాల్గొని దేశానికి విజయం సాధించాలనేదే ఆయన కోరిక, ఆయనకు సహకరించినటువంటి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షులు నరసింహ, నాయకులు మాదన్న, భీమన్న, లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్ అర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# 'ట్రై-సిటీ ఎఐ హ్యాకథాన్-26 ఘనంగా ప్రారంభోత్సవం



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉ సైన్స్, వరంగల్ ( కిట్స్ వరంగల్) లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉ మెషిన్ లెర్నింగ్ (సీఎస్ఎం) విభాగం, 'సెంటల్ ఇండియా హైదరాబాద్' ( ఐఐటి - ఐ ఎం పూర్వ విద్యార్థుల నేతృత్వంలోని స్టార్టప్)తో కలిసి జాతీయ స్థాయి 'ట్రై-సిటీ ఎఐ హ్యాకథాన్-2026'ను కిట్స్ వరంగల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. కిట్స్ వరంగల్ ఆతిథ్యం ఇస్తున్న భారతదేశపు మొట్టమొదటి 'ట్రై-సిటీ ఎఐ హ్యాకథాన్' ఇది. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవం నేడు కిట్స్ వరంగల్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న 1,500 మంది విద్యార్థుల కోసం అక్టోబర్ 10 మరియు 11 తేదీలలో రెండు రోజుల పాటు ఈ హ్యాకథాన్ నిర్వహించబడుతోంది. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే మరియు కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి వి. సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, పరిశ్రమ ప్రతినిధుల బృందంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయడం ద్వారా ఈ కార్యక్రమంని ప్రారంభించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే ఉ కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రెటరీ, వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ, వరంగల్, హన్మకొండ మరియు కాజీపేట ప్రాంతాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక ఆవిష్కరణలు మరియు పారిశ్రామికత (ఇంట్రెప్రెనేర్షిప్ ) రంగాలలో అభివృద్ధి చెందుతున్న కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ఈ రెండు రోజుల కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ హ్యాకథాన్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు; నమోదైన వారిలో 60 శాతానికి పైగా మహిళలే ఉండటం విశేషం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక సాంకేతికతలు మరియు ఆవిష్కరణల పట్ల మహిళల్లో పెరుగుతున్న ఆసక్తిని ఇది స్పష్టం చేస్తోంది అని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ' సెంట్రల్ ఇండియా' వ్యవస్థాపకుడు వంశీ గుగులోత్ ప్రకారం, రూ. 50,000 నగదు బహుమతి, సెంట్రల్ వ్యవస్థలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు, నిపుణుల మార్గదర్శకత్వం మరియు అత్యుత్తమ ప్రాజెక్టులకు ఇంక్యుబేషన్ అవకాశం వంటి అంశాలతో కూడిన ఈ కార్యక్రమం, కేవలం ఒక సాధారణ పోటీకి పరిమితం కాకుండా విద్యార్థులకు వృత్తిపరమైన ఎదుగుదల మరియు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే మార్గాలను కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తన అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ, నూతన ఆవిష్కరణల అవకాశాలు ప్రధాన మహానగరాలకే పరిమితం కాకూడదనే నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. వరంగల్ త్రినగర ప్రాంతంలోని విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు, మార్గదర్శకులు మరియు సంస్థాగత నాయకులను ఒకచోట చేర్చడం ద్వారా, ఈ హ్యాకథాన్ యువతరాన్ని ఆచరణాత్మకమైన ఏఐ-ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి మరియు వర్ధమాన సాంకేతికతల వాస్తవ ప్రపంచ అనువర్తనాలను అన్వేషించడానికి ప్రోత్సహిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హన్మకొండకు చెందిన ఐఏఎస్ అధికారి చాహత్ బాజ్‌పాయ్, కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి వి. సతీష్ కుమార్, వరంగల్ పోలీసు విభాగం ఐపీఎస్ అధికారి ఎన్. శ్వేత, కిట్స్ వరంగల్ సీఎస్ఎం విభాగ అధిపతి డాక్టర్ ఎ. జ్యోతి ప్రభ, వంటి ప్రముఖులు హాజరయ్యారు. అలాగే, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి కూడా అసోసియేట్ ప్రొఫెసర్ మరియు పి.ఆర్.ఓ. డాక్టర్ డి. ప్రభాకర చారి, అలాగే సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ బి. హనుమంతు మరియు డాక్టర్ ఎం. రాజేష్, వారి బృందంతో కూడిన ఫ్యాకల్టీ విద్యార్థి ప్రతినిధులు, 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర ప్రముఖులలో గైల్ ఇండియా మేనేజర్ జి. రాజన్న, ఆర్టీసీ డివిఎం జగన్, పోలీస్ శాఖ సీఐ కాశీరామ్, ఓరియంట్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ శ్రీనివాస్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ డైరెక్టర్ అశోక్ మరియు తెలంగాణ ప్రభుత్వ దీట్ అదనపు కార్పొరేట్ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి ఉన్నారు. అలాగే, సెంటల్ ఇండియా (సెంట్లే ఇండియా ) వ్యవస్థాపకుడు మరియు ఐఐమ్ పూర్వ విద్యార్థి వంశీ గుగులోత్, సెంటల్ ఇండియా సహ-వ్యవస్థాపకుడు మరియు ఐఐటీ పూర్వ విద్యార్థి సాయి గుగులోత్, బి - హబ్బు మీడియా మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ కుమార్, కందరా ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ సంజన, పోలీస్ అధికారి లాల్ సింగ్, మరియు వివిధ రంగాలకు చెందిన మెంటార్లు, పరిశ్రమ ప్రతినిధులు, నాయకత్వ బృంద సభ్యులు కూడా ఇందులో పాల్గొన్నారు.

# వరంగల్ చరిత్రను ముక్కలు చేసినదే కేసీఆర్ పదేళ్లుగా జిల్లా ప్రజలకు తీరని అన్యాయం...

- స్వార్థ రాజకీయాల కోసమే జిల్లాల విభజన..
- స్థానిక యువత ఉద్యోగ అవకాశాలకు దెబ్బ: ఎమ్మెల్యే నాయిని
- డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ ర్యాలీ..
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం..
- మహా నగర ప్రజలకు ఇది చీకటి దినం..



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ మహానగరాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అశాస్త్రీయంగా విభజించి, జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వరంగల్ జిల్లాల విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి, వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించిన కేసీఆర్ నిర్ణయానికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు నల్లజెండాలు, నిరసన నినాదాలతో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లాల విభజనకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్వరూపం, ప్రజల అవసరాలు, యువత భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వరంగల్‌ను విభజించడాన్నే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా విభజించడం వల్ల ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యత దెబ్బతినడంతో పాటు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, స్థానికత ఆధారంగా లభించాల్సిన ప్రయోజనాల విషయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఈ అన్యాయాన్ని పలుమార్లు ప్రశ్నించామని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వరంగల్ అభివృద్ధికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. కాకతీయుల పాలనా వైభవానికి, తెలంగాణ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన వరంగల్ కోట, వేయి స్తంభాల దేవాలయం, చారిత్రక కట్టడాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ లెక్కలకే ప్రాధాన్యమిస్తూ విభజించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వరంగల్‌కు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, పరిపాలనా ప్రాధాన్యతను కాపాడాల్సిన పాలకులే ఆ వారసత్వాన్ని విస్మరించారని మండిపడ్డారు. వరంగల్ నుంచి మొదలయ్యే ప్రజా ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తాయనే భయంతోనే ఈ ప్రాంత రాజకీయ ఐక్యతను దెబ్బతీసేలా జిల్లాల విభజనకు పాల్పడ్డారనే విమర్శను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా ముందుకు తెచ్చారు. సిద్ధిపేటకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో వరంగల్ అభివృద్ధిని విస్మరించారని, ఈ ప్రాంతానికి రావాల్సిన ప్రాధాన్యతను, అవకాశాలను దూరం చేశారని ఆరోపించారు. జిల్లా విభజనతో పరిపాలనా వ్యవస్థలో ఏర్పడిన అసంబద్ధతలు, చారిత్రక గుర్తింపుకు జరిగిన నష్టం ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. వరంగల్ జిల్లా విభజన జరిగి పదేళ్లు పూర్తయిన ఈ రోజును జిల్లా ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన రోజుగా అభివర్ణించారు. గతంలో తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు వరంగల్‌కు జరిగిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జిల్లాల విభజనను గొప్ప విజయంగా చిత్రీకరించుకోవడం కాదని, ఆ నిర్ణయం వల్ల వరంగల్ ప్రాంతానికి జరిగిన నష్టంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తోందని నాయిని పేర్కొన్నారు. మరోవైపు, గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు ఎదురైనప్పుడు వాటికి సమాధానం చెప్పకుండా సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా దుష్ప్రచారానికి పాల్పడటం రాజకీయ బాధ్యతారాహిత్యమని విమర్శించారు. వరంగల్ ప్రజల ప్రయోజనాల కంటే స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చిన నాయకులను జిల్లా ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

వరంగల్ చరిత్రను, ఆత్మగౌరవాన్ని, యువత భవిష్యత్తును రాజకీయ ప్రయోజనాలకు బలి చేసిన నిర్ణయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు. వరంగల్‌కు జరిగిన అన్యాయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ఈ ప్రాంత హక్కులు, అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తోందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ,డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , కుడా చైర్మన్ గుండు సుధారాణి ,లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్ ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు,జిల్లా కమిటీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై అవమానకర చర్యలు కాంగ్రెస్ పతనానికి నాంది!

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శం.. కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యల రాజ్యం: చల్లా ధర్మారెడ్డి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ జిల్లాల ఏర్పాటు దశాబ్ది సందర్భంగా శనివారం హనుమకొండలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని చల్లా ధర్మారెడ్డి పేర్కొన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం, 33 జిల్లాలను ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాకు కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టడం ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రైతుబంధు, రైతుబీమా, నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి పథకాలతో రైతాంగానికి భరోసా కల్పించారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన పరకాల రెవెన్యూ డివిజన్‌ను సాధించామని, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించామని గుర్తుచేశారు. దామెర, నడికుడ నూతన మండలాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అవసరమైన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టామన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. హనుమకొండలో 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం సహా విద్యా, వైద్య రంగాలకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కేసీఆర్‌ను అవమానిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసి, రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన కేసీఆర్ పట్ల కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడం, రంపాలతో కోసే విధంగా ప్రదర్శనలు నిర్వహించడం రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ సాధకుడిని అవమానించడం ద్వారా కాంగ్రెస్ నాయకులు ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నా రని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభు త్వం, తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడిని అవమానించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించలేరని అన్నారు. కేసీఆర్‌ను కించపరిచే చర్యలకు పాల్పడే నాయకులకు ప్రజాక్షేత్రంలో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, తాటికొండ రాజయ్య, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి తదితర నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# భీమేశ్వరుడిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

*దసరా, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై సమీక్ష.. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచన*

వేములవాడ, అక్టోబర్10 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కమిషనర్ దంపతులకు ఆలయ డీఈవో ప్రతాప నవీన్ కుమార్ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించి, వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయ ఉద్యోగులతో సమావేశమైన కమిషనర్ హనుమంతరావు రాబోయే దసరా, సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, పండుగ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ మీడియా కన్వీనర్‌గా కె. గురునాథరావు

**- బీజేపీ రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ చేతుల మీదుగా నియామకపత్రం అందజేత**



మేడ్చల్ జిల్లా,అక్టోబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ మీడియా కన్వీనర్‌గా కె.గురునాథరావు నియమితులయ్యారు.ఈ మేరకు బీజేపీ రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందె శ్రీనివాస్,జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్ ఆయనకు నియామక బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా లేబర్ సెల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి, తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో, పారదర్శకంగా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందె శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్‌లకు గురునాథరావు కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# జీవనశైలి వైద్యంతో బర్న్‌అవుట్‌కు చెక్




హైదరాబాద్, అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర) : ఉద్యోగ ఒత్తిడిని అధిగమించి, అసంక్రమిత వ్యాధులను నివారించడంలో జీవనశైలి వైద్యం కీలకమని తెలంగాణ వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె.చొంగ్తూ ఐఏఎస్ కన్నారు. శనివారం హైదరాబాద్ లోని హోటల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ లైఫ్‌స్టైల్ మెడిసిన్(ఐఎస్‌ఎల్‌ఎం) నిర్వహించిన 7వ అంతర్జాతీయ సదస్సు(ఐఎస్‌ఎల్‌ఎంకాన్-26)లో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ తెలంగాణ అధ్యక్షుడు డా.పి.కిషన్, మాజీ అధ్యక్షుడు డా.డి.ద్వారకానాథ్ రెడ్డి, ఐఎస్‌ఎల్‌ఎం అధ్యక్షురాలు డా.లక్ష్మి సుందర్ పాల్గొన్నారు. 'ఫ్రమ్ బర్న్‌అవుట్ టు బ్యాలెన్స్ : హెల్త్ త్రూ లైఫ్‌స్టైల్ మెడిసిన్' థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, వ్యాయామం, తగిన నిద్ర, ఒత్తిడి నిర్వహణతో వ్యాధులను నివారించవచ్చని వక్తలు పేర్కొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు కొరడా

**- నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న ప్రైవేట్ స్కూల్ మూసివేత**



గద్వాల అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ సెలవు దినాల్లో సైతం పాఠశాలలను నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ?గద్వాల పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో కూడా తరగతులు కొనసాగిస్తున్నారన్న సమాచారం జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ), మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) దృష్టికి వచ్చింది. దీనిపై తక్షణమే స్పందించిన అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ?ఈ క్రమంలో పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 'అగస్త్య లోక ముద్ర' ప్రైవేట్ పాఠశాలను అధికారులు నేరుగా పరిశీలించి, వెంటనే మూసివేయించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సెలవు రోజుల్లో స్కూళ్లు నడిపితే గుర్తింపు రద్దు చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# గద్వాల ఆర్టీసీ డిపో ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం

**- ఎమ్మెల్యే ని సన్మానించిన ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు**



గద్వాల అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఆర్టీసీ డిపోలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ గెలుపొందిన గాల్ రెడ్డి (అధ్యక్షుడు), గిరిరాజ్ (కార్యదర్శి) ఎన్నికైన సందర్భంగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వక కలిసి శాలువా కప్పి సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షుడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామన్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్ శ్రీను ముదిరాజ్, నాయకులు, వంట భాస్కర్, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై అపోహలు సృష్టించడం సరికాదు

**- అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలి.. లోపాలుంటే సరిదిద్దాలి**

**- ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి**

**- బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : ఈ ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని, దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ ప్రస్తుత పరిస్థితులపై బాధ్యతాయుతంగా ఆలోచించాలని బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు టి.సదానంద రెడ్డి అన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా రాజకీయ పార్టీలు వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దాలని, అంతేకానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనర్హంగా ఓట్లు తొలగించినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే, బాధితులకు తమ ఓటు హక్కును తిరిగి పొందే అవకాశం కల్పించాలని అన్నారు. పట్టణ వార్డులు, గ్రామాల స్థాయిలో అర్హులైన ఓటర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌరులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉంచుతూ, న్యాయ ప్రక్రియకు ఆటంకం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అయితే ఆ హక్కును శాంతియుతంగా, చట్టపరిధిలో వినియోగించుకోవాలని సదానంద రెడ్డి పేర్కొన్నారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, అనవసర ఉద్రిక్తతలకు కారణమయ్యే విధంగా వ్యవహరించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. చర్చలు, ఆధారాలు, చట్టపరమైన పోరాటాల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలపై అభ్యంతరాలు ఉన్న రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల మధ్యకు వెళ్లి తమ అభిప్రాయాలను వివరించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు పొందడం, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని అధికారంలోకి రావడం ప్రజాస్వామ్యంలో ఉన్న మార్గాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం కావాలని అన్నారు. దేశ ఐక్యత, శాంతిభద్రతలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సదానంద రెడ్డి పిలుపునిచ్చారు.

# దసరా సెలవుల సందర్భంగా మండల ప్రజలకు పోలీస్ శాఖ తరఫున ప్రజలకు విజ్ఞప్తి..

## ఎస్సై గురుస్వామి



అయిజ అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని పోలీస్ కార్యాలయము నందు ఎస్ఐ గురుస్వామి మండల ప్రజలను ఉద్దేశించి పలు సూచనలు చేస్తూ, మాట్లాడుతూ దసరా సెలవుల నేపథ్యంలో మండలంలోని ప్రజలు దసరా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా, సోదరభావంతో జరుపుకోవాలని అన్నారు.గ్రామాల్లో ఎలాంటి గొడవలు, వాగ్వాదాలు, ఘర్షణలకు తావివ్వకూడదు.మద్యం సేవించి వాహనాలు నడపకూడదు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని,గ్రామంల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలి. ఇంటి భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.పండుగల సందర్భంగా కుల, మత విభేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, ఇతరులను రెచ్చగొట్టే పోస్టులు, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయకూడదని, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దసరా సెలవుల్లో పిల్లలు చెరువులు, బావులు, కాలువలు వంటి నీటి ప్రదేశాల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదు.రోడ్లపై ఆటలు ఆడకూడదు, రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా చూసి జాగ్రత్తగా దాటాలని,తల్లిదండ్రులకు తెలియకుండా దూర ప్రాంతాలకు వెళ్లకూడదు.తెలియని వ్యక్తులు ఇచ్చే ఆహారం, బహుమతులు తీసుకోకూడదు. వారి వెంట వెళ్లకూడదని అన్నారు. బాణసంచా కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే కాల్చాలి. ప్రమాదకరమైన పద్ధతుల్లో బాణసంచా ఉపయోగించకూడదు.మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ ఉపయోగించేటప్పుడు అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదు.చిన్న పిల్లలను తల్లిదండ్రులు ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే 112 అత్యవసర సహాయ నంబర్‌కు ఫోన్ చేయాలి. దసరా పండుగను ప్రతి ఒక్కరూ సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని అయిజ ఎస్సై గురుస్వామి విజ్ఞప్తి చేశారు.

# ఓరుగల్లు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ రవిచంద్ర కు ఆహ్వానం

**అమ్మవారి 'పూలంగిసేవ' నిర్వహణ మా అదృష్టం :ఎంపీ రవిచంద్ర**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : ఓరుగల్లు శ్రీ భద్రకాళిదేవి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభం కానున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర -విజయలక్ష్మి దంపతులను విరి కుమారుడు కోడలు వద్దిరాజు సాయి నిఖిల్ చంద్ర- అనిలా దంపతులను,మరియు సోదరులు వద్దిరాజు కిషన్-శశిరేఖ, వద్దిరాజు దేవేందర్- ఇందిరా,వద్దిరాజు వెంకటేశ్వర్లు- ఉమామహేశ్వరి దంపతులను దేవి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా విచ్చేయవలసిందిగా కోరుతూ ఈరోజు వారి నివాసంలో శాలువాతో సత్కరించి అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థ ప్రసాదాలను అందించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత. భద్రకాళి దేవాలయం ప్రధాన అర్చకులు శేషు అయ్యగారు, ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఈ నవరాత్రులు అమ్మవారికి మరియు అమ్మవారి శేష వాహనములకు ఉదయం సాయంత్రం 'పూలంగిసేవ' చేసుకునే భాగ్యం మా కుటుంబానికి కలగడం అమ్మవారు మాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నాము, ప్రతిరోజు ఉదయం సాయంత్రం వివిధ రూపల్లో కొలువుతీరే అమ్మవారిని,శేష వాహనములను వివిధ రకాల పుష్పములచే గజమాలలతో సర్వాంగ సుందరముగా అలంకరింపచేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తాము కావున భక్తులందరూ ప్రతిరోజు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదములు స్వీకరించగలరని కోరినారు.ఈ కార్యక్రమంలో అర్చకులు అరవింద్ శర్మ, భరద్వాజ్ శర్మ, ఆలయ సిబ్బంది సూపరింటెండెంట్ కూచన హరినాథ్, నాగులు తదితరులు పాల్గొన్నారు..

హనుమద్గిరి పద్మాక్షి దేవి నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం

హనుమద్గిరి పద్మాక్షిని ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నివాసానికి విచ్చేసిన ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ శర్మ అయ్యగారు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా రావాల్సిందిగా కోరుతూ అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థప్రసాదాలు అందించడం జరిగింది..

# రాత్రనక, పగలనక.. 24 గంటలూ ప్రజా సేవలో పోలీసులు

**- పోలీసుల సేవలు, అంకితభావం అభినందనీయం**

**- పోలీసుల విజయాల వెనుక కుటుంబ సభ్యుల త్యాగాలు విలువైనవి.**

**- జిల్లా కలెక్టర్ ప్రియాంక**

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**




నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసుల ఆత్మీయ సమ్మేళనం (బడా ఖానా) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాక హాజరయ్యారు. ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు, కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అధికారులు, సిబంది కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఆటలు, దాండియా, బతుకమ్మ, పాటలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపోలీసులు రాత్రనక, పగలనక, పండుగలతో సంబంధం లేకుండా 24 గంటలూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తారని కొనియాడారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. పోలీసుల విధి నిర్వహణ వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూగత ఏడాది కాలంగా జిల్లా పోలీస్ శాఖలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారని తెలిపారు. పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు పోలీసు కుటుంబాల మధ్య సాన్నిహిత్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. పోలీసులు విధుల్లో నిరంతరం నిమగ్నమై ఉండటం వల్ల వారి కుటుంబ సభ్యులు ఎన్నో సందర్భాల్లో తమ వ్యక్తిగత ఆనందాలను, అవసరాలను పక్కనపెట్టి సహకరిస్తారని ఎస్పీ తెలిపారు. పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహనం, ప్రోత్సాహం ఎంతో విలువైనవని అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యుల సహకారంతోనే మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించగలుగుతున్నామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావాన్ని కొనసాగిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య, సిఐలు ఎస్ఐలు పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేదు

**- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలు, పేద వర్గాల ఓటర్లు తొలగింపే లక్ష్యం**

**- వలస కార్మికులకు తీవ్ర నష్టం**

**- పారదర్శకత లోపించడం**

**- రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం**

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపారి సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేకుండా పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపారి ఇక్బాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలు, పేద వర్గాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని తొలగింపులు జరుగుతున్నాయని ఆయన విమర్శిస్తున్నారు. శనివారం సయ్యద్బాల్ హుస్సేన్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు.వలస కార్మికులకు నష్టం: వెరిఫికేషన్ ప్రక్రియ కోసం చాలా తక్కువ సమయం (ఉదాహరణకు ఒక నెల) ఇవ్వడం వల్ల, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కార్మికులు నష్టపోతారని, వారు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శకత లోపించడం: ఎన్నికల సంఘం ఏ ప్రాతిపదికన ఓటర్ల తొలగింపులు చేపడుతుందో స్పష్టమైన నివేదికలు ఇవ్వడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ఫామ్-6 మార్పుల విషయంలో కూడా ఈసీ వ్యవహారశైలిపై సుప్రీంకోర్టులో సవాళ్లు ఎదురయ్యాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం: కేంద్రంలోని అధికార బీజేపీ తనకు అనుకూలంగా ఓటర్ల జాబితాలను మార్చేందుకు కుట్రలు పన్నుతుందని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షాల బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లను తగ్గించేందుకు ఈ ప్రక్రియను వాడుకుంటోందని, ఓట్ల దొంగతనం గా దీనిని అభివర్ణించవచ్చన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలు ఆయన రాజీనామాకు, ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎమ్మెల్యే విజయుడు కి ఆహ్వానం



అలంపూర్ అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు విజయుడు కి 70వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్--17 బాలుర హాకీ టోర్నమెంట్ ఎంపిక పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను సంబంధిత అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని అధికారులు ఎమ్మెల్యే విజయుడు ని కోరారు. ఇట్టి ఆహ్వానంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో అక్టోబర్ 12 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 12వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

# స్పీకర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఫైనాన్స్ కమిషన్ మెంబర్ కాకి రంగరాజ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : అధికారిక విదేశీ పర్యటనను విజయవంతం చేసుకొని హైదరాబాద్ కు వచ్చిన శుభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి రంగరాజ్ ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మినిస్టర్స్ అధికారిక నివాసంలో శాసనసభాపతికి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సత్కరించారు. వీరితోపాటు పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి డిసిసి జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ ఎంపీపీ సీనియర్ నాయకులు పంచాయితీ రాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి నర్సిములు అనంతరెడ్డి డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మైనారిటీ నాయకులు కరీమ్ లు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో సంచలనం

**- టీడీపీ ఎమ్మెల్సీ దగ్గరే రూ.25 లక్షలు కాజేసిన రియల్ ఎస్టేట్ కేటుగాళ్లు**

**- మాదాపూర్ 5.5 ఎకరాల పేరుతో భారీ మోసం!**



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 10: తమది కాని భూమిని తమదేనని నమ్మించి ఏకంగా అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్సీ దగ్గరే రూ. 25 లక్షలు కాజేసిన ఘటన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న మాదాపూర్, హైటెక్ సిటీ పరిసరాల్లో మరో భారీ మోసం వెలుగులోకి వచ్చింది.

**మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో భూమి ఉందని నమ్మించి...**

బాధితుడు ఆంధ్రప్రదేశ్ కు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య. ప్రస్తుతం ఆయన జూబ్లీహిల్స్ లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా హైదరాబాద్ లో భూమి కొనుగోలు కోసం చూస్తున్న ఆయనకు పేరూరు తులసిగోపాల్, అతని కుమారుడు గిరిధర్ అనే ఇద్దరు వ్యక్తులు పరిచయమయ్యారు. మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో తమకు 5.5 ఎకరాల ప్రైమ్ ల్యాండ్ ఉందని, అత్యవసరంగా అమ్మాల్సి వచ్చిందని, తక్కువ ధరకే ఇస్తామని చెప్పి ఎమ్మెల్సీని నమ్మించారు. కోట్ల విలువైన భూమి చౌకగా వస్తుందనే ఆశతో ఎమ్మెల్సీ రామచంద్రయ్య వారి మాటలు నమ్మి రూ. 25 లక్షలు అడ్వాన్స్ గా ఇచ్చారు.

**పత్రాలు అడగడంతో బయటపడ్డ అసలు బండారం:**

అడ్వాన్స్ ఇచ్చిన తర్వాత భూమికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు చూపించాలని ఎమ్మెల్సీ కోరారు. దీంతో తులసిగోపాల్, గిరిధర్ లు తప్పించుకుని తిరగడం మొదలుపెట్టారు. ఫోన్లు ఎత్తకపోవడం, కలవడానికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఎమ్మెల్సీ తన సొంతంగా ఆరా తీశారు. ఆరా తీయగా సంచలన విషయం బయటపడింది. మాదాపూర్ లో వారు చూపించిన 5.5 ఎకరాల భూమి అసలు తులసిగోపాల్ దే కాదని, ఆ భూమికి వారికి ఎటువంటి సంబంధం లేదని తేలింది. తమది కాని భూమిని తమదిగా చూపించి మోసం చేశారని గ్రహించిన ఎమ్మెల్సీ వెంటనే పోలీసులను ఆశ్రయించారు.

**కేసు నమోదు, గాలింపు:**

ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితులైన పేరూరు తులసిగోపాల్, అతని కుమారుడు గిరిధర్ లపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. వారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# మార్గమధ్యంలో పంచరైన 108 అంబులెన్స్..

**- గర్భిణికి తప్పిన ఇబ్బందులు**

**- జోగిపేట నుంచి మరో అంబులెన్స్‌ను రప్పించి ఆసుపత్రికి తరలింపు**










చౌటకూర్, అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర): అత్యవసర సమయంలో గర్భిణిని ప్రసవం కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్ మార్గమధ్యంలో పంచరైంది. దీంతో కొద్దిసేపు గర్భిణిని ఆసుపత్రికి తరలించే ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. అయితే, అప్రమత్తమైన అంబులెన్స్ పైలెట్ వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో గర్భిణిని మరో అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం మధ్యాహ్నం పుల్కల్ నుంచి గర్భిణిని ప్రసవం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో తాడ్డాన్‌పల్లి చౌరస్తా సమీపంలోని టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే అంబులెన్స్ టైరు పంచరైంది. దీంతో గర్భిణిని సకాలంలో ఆసుపత్రికి చేర్చే విషయంలో కొంత ఇబ్బంది ఎదురైంది.పరిస్థితిని గమనించిన అంబులెన్స్ పైలెట్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆలస్యం కాకుండా ఉండేందుకు జోగిపేట నుంచి మరో 108 అంబులెన్స్‌ను రప్పించారు. అనంతరం గర్భిణిని జోగిపేట నుంచి వచ్చిన మరో అంబులెన్స్‌లోకి మార్చి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో గర్భిణిని ఆసుపత్రికి చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

**అంబులెన్స్‌ల నిర్వహణపై దృష్టి పెట్టాలి**

అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడంలో 108 అంబులెన్స్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇలాంటి వాహనాలు మార్గమధ్యంలో సాంకేతిక సమస్యలకు గురైతే రోగులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 108 అంబులెన్స్‌లను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంతోపాటు టైర్లు, ఇంజిన్, ఇతర కీలక భాగాల పనితీరును పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

# పూలలో ప్రకృతి.. బతుకమ్మలో తెలంగాణ!

- తొమ్మిది రోజుల పూల సంబురం.. ఆడపడుచుల ఆటపాటల కోలాహలం..

- ప్రకృతి ఆరాధనతో వెల్లివిరిసే తెలంగాణ సంస్కృతి వైభవం.

*తంగేడు, గునుగు పూల పరిమళాలు.. బతుకమ్మ పాటల సందళ్లు.. ఆడపడుచుల ఆటపాటల కోలాహలం.. వెరసి తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల వరకు పూల పండుగ శోభను సంతరించుకుంటోంది. ప్రకృతిని ఆరాధిస్తూ, సంప్రదాయాలను చాటుతూ తొమ్మిది రోజులపాటు సాగే బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, ఆత్మీయత, ఆడపడుచుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి.*

మేడ్చల్ జిల్లా/బోడుప్పల్ ,అక్టొంబర్ 09(మరాటి మల్లేష్,విజన్ ఆంధ్ర ప్రతినిధి):బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ కాదు.. ప్రకృతి ఆరాధన, ఆడపడుచుల ఆత్మీయత, కుటుంబ బంధాలు, సామాజిక ఐక్యత, తెలంగాణ అస్తిత్వాల సమ్మేళనం. పూలలో ప్రకృతిని.. పాటల్లో సంప్రదాయాన్ని.. వేడుకల్లో ఐక్యతను ప్రతిబింబిస్తూ బతుకమ్మ తెలంగాణ గుండె చప్పుడుగా, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా వెలుగొందుతోంది.పూలను దేవతగా భావించి పూజించే ఈ పండుగ తెలంగాణ జీవనశైలిలో విడదీయలేని భాగంగా మారింది.

**పూలతో పేర్చిన ప్రకృతి సౌందర్యం**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. ఆశ్వయుజ మాసంలో జరుపుకునే ఈ పండుగలో ప్రకృతిలో సహజంగా లభించే తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చుతారు. పూలను వరుసలుగా అమర్చి మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు. పూల అందాలు, పాటల మాధుర్యం, సంప్రదాయాల సమ్మేళనం ఈ పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**తొమ్మిది రోజులు.. తొమ్మిది ప్రత్యేకతలు**

బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజులపాటు ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకతతో కొనసాగుతాయి. ప్రతి రోజూ ప్రత్యేకంగా బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించి, సంప్రదాయ నైవేద్యాలను సమర్పిస్తారు.

**మొదటి రోజు:**

ఎంగిలిపూల బతుకమ్మ
నువ్వులు, బియ్యపు పిండి లేదా నూకలు

**రెండో రోజు:**

అటుకుల బతుకమ్మ
అటుకులు, బెల్లం

**మూడో రోజు:**

ముద్దపప్పు బతుకమ్మ
ముద్దపప్పు, పాలు, బెల్లం

**నాలుగో రోజు:**

నానబియ్యం బతుకమ్మ
నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం

**ఐదో రోజు:**

అట్ల బతుకమ్మ
అట్లు

**ఆరో రోజు:**

అలిగిన బతుకమ్మ
సాధారణంగా నైవేద్యం సమర్పించరు

**ఏడో రోజు:**

వేపకాయల బతుకమ్మ
వేపకాయల ఆకారంలో తయారుచేసిన బియ్యపు పిండి వంటలు

**ఎనిమిదో రోజు:**

వెన్నముద్దల బతుకమ్మ
వెన్న, నువ్వులు, బెల్లం

**తొమ్మిదో రోజు:**

సద్దుల బతుకమ్మ
ఐదు రకాల సద్దులు, సంప్రదాయ నైవేద్యాలు



ప్రాంతీయ ఆచారాలను బట్టి నైవేద్యాల తయారీ విధానాల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. ప్రతి రోజు నిర్వహించే పూజలు, పాటలు, వేడుకలు బతుకమ్మ పండుగలోని వైవిధ్యాన్ని చాటుతాయి.

**సద్దుల బతుకమ్మ.. సంబురాలకు పరాకాష్ఠ**

తొమ్మిది రోజుల వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు విశేష ప్రాధాన్యం ఉంది. మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలను పేర్చి, పూజలు నిర్వహించి, ఐదు రకాల సద్దులు తదితర సంప్రదాయ నైవేద్యాలను సమర్పిస్తారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా చెరువులు, ఇతర నీటి వనరుల వద్దకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా మహిళలు సామూహికంగా పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేస్తారు. పండుగ ముగింపు వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనతోపాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయి.

**ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక**

బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాల బలోపేతానికి ప్రతీకగా నిలుస్తుంది. పెళ్లిళ్ల తర్వాత ఇతర ప్రాంతాల్లో నివసించే ఆడపడుచులు సైతం పండుగ సందర్భంగా పుట్టింటికి చేరుకుని కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకుంటారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ ఆడటం సామాజిక అనుబంధాలను మరింత బలపరుస్తుంది. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలు, పూజా సంప్రదాయాలు భావితరాలకు వారసత్వంగా అందుతాయి.

**ప్రకృతి పరిరక్షణకు సందేశం**

బతుకమ్మలో ఉపయోగించే సహజసిద్ధమైన పూలు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయి. స్థానిక పూలకు ప్రాధాన్యం ఇవ్వడం, పండుగలో పర్యావరణహిత పద్ధతులను అనుసరించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు. బతుకమ్మ నిమజ్జనం అనంతరం చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. పండుగ ఆనందంతోపాటు పర్యావరణ స్పృహను కూడా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి పరిచయం**

కాలం మారుతున్నా బతుకమ్మ పండుగకు ఉన్న ఆదరణ తగ్గడం లేదు. తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సైతం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సంప్రదాయ దుస్తులు, పూల అలంకరణలు, జానపద గీతాల ద్వారా తెలంగాణ సంస్కృతి విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. బతుకమ్మ వేడుకలు మహిళల సృజనాత్మకతకు, సంప్రదాయాల పరిరక్షణకు వేదికగా నిలుస్తున్నాయి.

**విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం..**

# కోరిన కోర్కెలు తీర్చే కల్వకుర్తి కన్యకామాత

- 37 ఏళ్ల చెక్కుచెదరని చరిత్ర

- 50 లక్షల బంగారు కిరీటంతో నేటి నుంచి శరన్నవరాత్రులు!

**తెలంగాణ స్టేట్ బ్యూరో, కల్వకుర్తి, విజన్ ఆంధ్ర,అక్టోబర్ 09:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో కొలువైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఒక చరిత్ర. ఒక వ్యాపారి సంకల్పం, కొందరు దాతల త్యాగం, ఒక పట్టణ ప్రజల భక్తికి నిదర్శనం ఈ ఆలయం. నేటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ విశిష్ట చరిత్రపై ప్రత్యేక కథనం.



దేవాలయాన్ని నిర్మించిన జూలూరు చంద్రమౌళి కీర్తిశేషులు....




కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం...

**1988లో ఒక భక్తుడి సంకల్పం:**

కల్వకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జూలూరు చంద్రమౌళి మొదట మంత్రాలయ రాఘవేంద్ర స్వామికి పరమ భక్తుడు. పట్టణంలో రాఘవేంద్ర స్వామి ఆలయాన్ని నిర్మించాలని ఎంతగానో ప్రయత్నించారు. అప్పట్లో మంత్రాలయ మఠం నుంచి అనుమతులు రాకపోవడంతో, తన దృష్టిని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణం వైపు మళ్లించారు. అప్పట్లో ఆయన తన మిత్రులు సంబు ప్రభాకర్,పోల సింహయ్య, జూలూరి విజయ్ కుమార్, దాచేపల్లి శంకరయ్యలతో కలిసి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ విషయాన్ని గుండా గోవిందు, సంబు నరసింహులు, గుండా మధుసూదన్, పాపిశెట్టి రాములు, బిల్లారి చంద్రయ్య అనే దాతల వద్దకు వెళ్లి చెప్పగానే, వారు ఏకంగా ఒక ఎకరం స్థలాన్ని ఉచితంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

**10 వేల అడ్వాన్స్ నుంచి 20 లక్షల ఆలయం వరకు**

మొదట ఈ ఆలయాన్ని మహబూబ్ నగర్ చౌరస్తాలో ఎద్మ రామచంద్రారెడ్డి పొలంలో నిర్మించాలని భావించి లక్ష రూపాయలకు మాట్లాడుకుని 10 వేల అడ్వాన్స్ కూడా ఇచ్చారు. అయితే పంట పొలం వద్దని, చివరకు హైదరాబాద్ - దేవరకొండ ప్రధాన రహదారిలో ప్రస్తుతం ఉన్న స్థలాన్ని ఎంచుకున్నారు. ఆలయ నిర్మాణం కోసం జూలూరు చంద్రమౌళి బృందం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం తిరిగి చందాలు వసూలు చేశారు. ఆ చందా సొమ్ముతో కనీసం భోజనం కూడా చేయకూడదని నియమం పెట్టుకుని, బొంగులు, పుట్నాలతో కడుపు నింపుకుని, దాతల సహకారంతో దాదాపు 20 లక్షల రూపాయలతో 1988లో ప్రారంభించిన గుడి నిర్మాణాన్ని 1990 నాటికి పూర్తి చేశారు.

**1990లో ఘన ప్రారంభం - రాష్ట్రంలోనే తొలి అన్నప్రసాదం:**

1990 జూన్ 13వ తేదీన అప్పటి ఆర్థిక శాఖ మంత్రి కొణిజేటి రోశయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే చిత్తరంజన్ దాస్, దేవాదాయ శాఖ మంత్రి మాగంటి రవీంద్రనాథ్ చౌదరి చేతుల మీదుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగింది.ఆలయ ప్రారంభం నాటి నుంచే ఇక్కడ ఒక సరికొత్త సంప్రదాయానికి తెరతీశారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమాన్ని ఈ ఆలయంలోనే ప్రారంభించడం విశేషం.



దేవాలయంలో కొలువైన అమ్మవారు...

**37 ఏళ్లుగా చెక్కుచెదరని మహిమ:**

విగ్రహ ప్రతిష్ట జరిగి 37 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు అమ్మవారి విగ్రహం చెక్కుచెదరకపోవడం, ఎటువంటి మరమ్మత్తులు అవసరం లేకపోవడం అమ్మవారి మహిమగా భక్తులు భావిస్తారు. ప్రతిరోజూ అర్ధరాత్రి 12 గంటల తర్వాత అమ్మవారు పట్టణమంతా కలియ తిరుగుతారని, అమ్మవారు నడుస్తుంటే గజ్జల శబ్దం వినిపిస్తుందని పట్టణానికి చెందిన పలువురు మహిళలు చెబుతుండటం ఇక్కడి ప్రత్యేకత.

**యువకుల చేతిలో నవశకం - 50 లక్షల బంగారు కిరీటం:**

2006 వరకు 3 నుంచి 4 లక్షలతో ఆర్యవైశ్యులు, దాతల సహకారంతో నవరాత్రులు జరిగేవి. 2006లో ఆర్యవైశ్య యువకులు ముందుకు రావడంతో ఉత్సవాలు అంగరంగ వైభవంగా మారాయి. ప్రతి ఏటా ఒకరిని చైర్మన్ గా నియమిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయ చైర్మన్ గా కొనసాగిన జూలూరు చంద్రమౌళి 2020లో మరణించగా, ఆయన కుమారుడు జూలూరు రమేష్ బాబు తండ్రికి తగ్గ తనయుడిగా బాధ్యతలు చేపట్టి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఆయన హయాంలోనే దాతల సహకారంతో 50 లక్షల రూపాయల విలువైన బంగారు కిరీటాన్ని అమ్మవారికి చేయించి బహుకరించారు. ప్రస్తుతం దేవీ నవరాత్రి ఉత్సవాలను 40 నుంచి 50 లక్షల రూపాయల వ్యయంతో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అన్నప్రసాద కార్యక్రమం, చీరల వేలం పాటలో గత ఏడాది ధనలక్ష్మి చీర ఏకంగా 1,70,000 రూపాయలకు పాడుకోవడం ఆలయానికి ఉన్న ఆదరణకు నిదర్శనం. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కల్వకుర్తి కన్యకామాత భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతోంది.



అమ్మవారికి 50 లక్షల రూపాయలతో చేయించిన బంగారు కిరీటం....

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.